RNI NO:TELTEL/ 2023/89546



# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 328 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 24 ఫిబ్రవరి 2025 | వెల : 4/-

### గంటలు గడుస్తున్న కొద్దీ

# టెన్షన్... టెన్షన్





38గంటలుగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్..!

ఇంకా బయటపడని ఆ ఎనిమిది మంది

ముమ్మరంగా సహాయక చర్యలు... అయినా కనిపించని పురోగతి

ఆ ఎనిమిది ఇంకా సజీవంగానే ఉన్నారా? అంటూ సందేహాలు

ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టేందుకు చేపట్టిందే..

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్. నాలుగు దశాబ్దాల పాటు కలగానే ఉన్న ఈ ప్రాజెక్టు పనులు..

2007లో మొదలయ్యాయి. ఈ ప్రాజెక్టు నుంచి నీటిని తరలించే ప్రాంతం..

పూర్తిగా నల్లమల అటవీ ప్రాంతం. అందుకే టన్నెల్ ద్వారా నీటిని తరలించేలా ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు.

నల్లగొండ

ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల చిరకాల వాంఛ శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు. ఆరు నియోజకవర్గాల్లో 3 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు.. 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు.. నాలుగు దశాబ్దాల కాలంగా ముందుకు సాగడం లేదు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఫుల్ ఫోకస్ పెట్టింది. దీంతో సుమారు ఐదేళ్ల తర్వాత టన్నెల్ పనులు ఇటీవల తిరిగి ప్రారంభమయ్యాయి. అంతలోనే అనుకోని ప్రమాదం జరిగింది.. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్%ొ%. బయట నుంచి చూస్తేనే చీకటి గుయ్యారం. ఇక 14 కిలోమీటర్ల లోపలకు వెళితే ఎలా ఉంటుందో ఊహించుకోండి. అక్కడ చిక్కుకుపోతే, బయటకు వచ్చే మార్గం కనిపించకపోతే%ొ%అసలు ఊహించుకోవడానికి కూడా సాధ్యం కాదు. కాని కొన్ని గంటల నుంచి ఆశకు శ్వాసకు మధ్య ఎనిమిది మంది ఊగిసలాడుతున్నాయి. వాళ్లను క్షేమంగా బయటకు తెచ్చేందుకు సహాయక బృందాలు తీవ్రంగా - మిగతా3లో

## యాదాద్రిలో స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరించిన సీఎం రేవంత్



యాదాద్రి మహా కుంభాభిషేకంలో రేవంత్ రెడ్డి దంపతులు

యాదాద్రిలో ఘనంగా మహా కుంభాభిషేకం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు

పంచకుండాత్మక మహా పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం దంపతులు

పంచతల విమాన గోపురం వద్ద ప్రత్యేక పూజలు

యాదాద్రి

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, - మిగతా3లో



## బానిస మనస్తత్వాలు

- బానిస మనస్తత్వంతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారు
- విదేశీ మద్దతు ఉన్నవాళ్లు మన నమ్మకాలను తప్పుబడుతున్నారు
- కుంభమేళా ఐక్యతా చిహ్నంగా భావితరాలకు స్ఫూర్తినిస్తుంది
- అంతరిక్ష రంగంలో దేశం ఏటా పురోగతి సాధిస్తోంది
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ మరింత ముందుకెళ్లాలని
- మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన ప్రధాని.

# కాంగ్రెస్ పార్టీని ఎవ్వరూ నమ్మడం లేదు

- కాంగ్రెస్ పార్టీకి వచ్చేది మాత్రం గాడిద గుడ్డే
- పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు
- ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడి
- సోనియా గాంధీ సంతకంతో ఇంటింటి ప్రచారం చేసి ఓట్లు వేయించుకొని ప్రజల్ని ఆ పార్టీ నేతలు మోసం చేశారు
- ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలు అమలు చేయలేదు



ఆదిలాబాద్

పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని ఎవ్వరూ నమ్మడం లేదని చెప్పారు. ఏ ఎన్నికలు జరిగినా.. కాంగ్రెస్ పార్టీకి వచ్చేది మాత్రం గాడిద గుడ్డేనని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సోనియా గాంధీ సంతకంతో ఇంటింటి ప్రచారం చేసి ఓట్లు వేయించుకొని ప్రజల్ని ఆ పార్టీ నేతలు మోసం చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని చెప్పారు. గత రెండు ప్రభుత్వాలు రూ. 9 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని విమర్శించారు. మన తెలంగాణలో కూడా డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే.. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఒక సారి గెలిచిన రాష్ట్రంలో మళ్లీ - మిగతా3లో



## చవకగా కేన్సర్ మందులు, దేశవ్యాప్తంగా డేకేర్ సెంటర్లు

- బాగేశ్వర్ థామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్ట్ ఇన్స్టిరీట్‌కు శంకస్థాపన
- కేన్సర్‌తో పోరాడేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో పలు ప్రకటనలు
- కేన్సర్ మందులు చవకగా దొరికేలా చూసేందుకు, మూడేళ్లలో దేశంలోని అన్ని జిల్లాల్లోనే కేన్సర్ డేకేర్ సెంటర్లు తెరిచేందుకు నిర్ణయం

# ఉప ఎన్నికల్లో గెలుపు మాదే..

- తెలంగాణలో బైపోల్స్ ఖాయం
- మాజీ మంత్రి తలసాని శశ్రీనివాస్ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు
- న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకే పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానంలో ఉప ఎన్నికలు రావడం ఖాయం.
- గత ప్రభుత్వ హయాంలో కొమురవెల్లి మల్లన్న క్షేత్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేశాం
- ఎన్నికల సమయంలో ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క గ్యారెంటీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదు



సిద్దిపేట జిల్లా:


తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై మాజీ మంత్రి తలసాని శశ్రీనివాస్ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకే పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానంలో ఉప ఎన్నికలు రావడం ఖాయం. ఆ ఎన్నికల్లో గెలుపు తమదేనని జోస్యం చెప్పారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సమేతంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, ఆయన మీడియాతో - మిగతా3లో



## ఆప్ విపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి అతిషి

- ఈ పదవికి తొలి మహిళగా రికార్డు
- ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సభ్యుల సమావేశంలో నిర్ణయం
- పార్టీ క్లిష్ట కాలంలో ఢిల్లీ సీఎంగా ఆమె సేవలందించారు
- ఆరోగ్యకరమైన ప్రతిపక్షంగా ఆప్ తన బాధ్యతలను నెరవేరుస్తుంది
- ప్రజలు ఆప్‌కు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు
- బలమైన ప్రతిపక్షం ఎలా పనిచేస్తుందో తాము చూపిస్తాం

# బానిస మనస్తత్వాలు...



భోపాల్: కొన్ని శక్తులు దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. భారతదేశ మత, సాంస్కృతిక సంప్రదాయాలను కొన్ని శక్తులు వ్యతిరేకిస్తున్నాయని ధ్వజమెత్తారు. మహా కుంభమేళాను ఉద్దేశిస్తూ ఇటీవల ప్రతిపక్షాలు చేసిన విమర్శలపై మోదీ ఘాటుగా స్పందించారు. వారంతా బానిస మనస్తత్వం కలిగిన వారిగా అభివర్ణించారు ప్రధాని మోదీ. ఈ తరహా వ్యాఖ్యలతో దేశ ఐక్యతను దెబ్బ తీయడమే అవుతుంది కానీ దాని వల్ల కలిసొచ్చే ఏమీ లేదన్నారు. అనేక సార్లు విదేశీ శక్తులు సైతం ఈ వ్యక్తులకు మద్దతు ఇవ్వడం ద్వారా దేశాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు.విశ్వాసాలు, నమ్మకాలు, ఆలయాలు, మతం, సంస్కృతితో పాటు మన పండుగలు, సంప్రదాయాలు, ఆచారాలను వీరంతా మంటగలుపుతున్నారు. దాని ఫలితంగా దేశ ఐక్యతను దెబ్బతీయడమే వారు పనిగా పెట్టుకున్నారని మోదీ మండిపడ్డారు.

ప్రధాని మోదీ మధ్యప్రదేశ్ లోని చత్తార్ పుర్లో భాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ సెంటర్ సైన్స్ రీసెర్చ? సెంటర్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజలను ఉద్దేశించిన మోదీ మాట్లాడారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే శక్తులతో చాలా ప్రమాదకరమన్నారు. మన దేశ సాంప్రదాయలు, సంస్కృతిలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వారు బానిస మసనస్తత్వంతో ఉంటూ దేశ ఐక్యతను దెబ్బ తీయడానికి యత్నిస్తున్నాయన్నారు.

మహా కుంభ మేళాలో తొక్కిసలాల జరిగిన నాటి నుంచి అటు కేంద్ర ప్రభుత్వంపై ఇటు యూపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి ప్రతిపక్షాలు. మహా కుంభమేళా అనేది మృత్యు కుంభ్ మేళా అని పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ వ్యాఖ్యానించగా, అఖిలేస్ యాదవ్, మల్లిఖార్జున ఖర్గే వంటి వారు సైతం తీవ్ర విమర్శలు చేశారు.

**ఇస్రో పనితీరు గర్వకారణం..**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 100వ రాకెట్ ప్రయోగం పూర్తి చేయడం గర్వకారణంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అంతరిక్ష రంగంలో దేశం ఏటా పురోగతి సాధిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ఇస్రోకు ప్రధాని అభినందనలు తెలియజేశారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన ప్రధాని.. ఇస్రో, ఏఐ రంగాలపై ప్రధానంగా చర్చించారు.

గతంతో పోలిస్తే ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల సంఖ్య పెరగడం అభినందనీయమని ప్రధాని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ మరింత ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కైలాష్‌ను మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. గిరిజన భాషలను పరిరక్షించడంలో ఆయన సాయం చేశారంటూ కొనియాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి కొలామి భాషలో కైలాష్ పాటను కంపోజ్ చేశారని ప్రధాని మోదీ అన్నారు.

# ఆప్‌లో చేరిన పంజాబీ నటి సోనియా మాన్



చండీగఢ్: పంజాబ్ నటి సోనియా మాన్ ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సమక్షంలో? పార్టీలో చేరారు. సోనియా రాకను ఆప్ పంజాబ్ స్వాగతించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా.. "కీర్తి కిసాన్ యూనియన్ నాయకుడు ఎస్ బల్దేవ్ సింగ్ కుమార్తె, పంజాబీ నటి సోనియా మాన్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఆమెకు ఆమ్ ఆద్మీ కుటుంబంలోకి స్వాగతం" అంటూ ట్వీట్ చేసింది. మరో వైపు, ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన ఆమ్ ఆద్మీ పార్టీలో సోనియా జాయిన్ కావడంపై చర్చ నడుస్తోంది. 1986లో ఖలిస్తానీ ఉగ్రవాదుల చేతిలో హత్యకు గురైన రైతు కిసాన్ నాయకుడు బల్దేవ్ సింగ్ కూతురే సోనియా మాన్. ఆమె 1986, సెప్టెంబరు 10న ఉత్తర ప్రదేశ్‌లోని హల్ద్వానీలో జన్మించింది. సోనియా అమృత్‌సర్ పట్టణంలో పెరిగింది. హోలీ హార్ట్ ప్రెసిడెన్సీ స్కూల్ నుండి స్కూల్ విద్యను, అమృత్‌సర్‌లోని బీబీకె డీఏవీ కాలేజ్ ఫర్ ఉమెన్ లో తన కళాశాల విద్యను పూర్తి చేసింది. పంజాబీతో పాటు ఇతర భాషాల్లో కూడా నటించి సోనియా మాన్ యాక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. మలయాళం, హిందీ, తెలుగు, మరాఠీతో సహా వివిధ భాషలలో బహుళ చిత్రాలలో నటించింది. సోనియా మాన్ తొలి చిత్రం 'హైడ్ ఎన్' సీక్'. 2014లో హిందీలో తొలిసారిగా కహిన్ హై మేరా ప్యార్‌లో కూడా యాక్ట్ చేసింది. 2020లో వచ్చిన హ్యాపీ హార్డీ, హీర్ చిత్రాల్లోనూ నటించి ప్రశంసలు అందుకుంది. సినిమాలతో పాటు 2018లో మరణించిన ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలాతో సహా ప్రసిద్ధ సింగర్లతో కలిసి పని చేసిన ఆమె.. నటిగా రాణిస్తూనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. పంజాబ్‌లోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. కాగా, 2022లో జరిగిన పంజాబ్ ఎన్నికల్లో ఆప్ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సీఎం భగంత్ మాన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటైంది. మరో రెండేళ్లలో పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో కేజ్రీవాల్ పంజాబ్‌పై దృష్టి పెట్టారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో 2027లో జరగనున్న పంజాబ్‌లోనైనా అధికారాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నాల్లో కేజ్రీవాల్ ఉన్నారు.

# కాంగ్రెస్‌తో విభేదాలపై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: కాంగ్రెస్‌లో మరోసారి విభేదాలు తలెత్తాయా? పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు, అధిష్టానానికి మధ్య విభేధాలు నడుస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై శశిథరూర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు.18వ శతాబ్దం నాటి ఆంగ్ల కవి థామస్ గ్రే కవితలోని పదాలను ఆయన షేర్ చేశారు. "అజ్ఞానం ఆనందంగా ఉన్న చోట తెలివిగా ఉండటం మూర?త్వం" అనే అర్థం వచ్చేలా ఈ కవిత సాగింది.

కాంగ్రెస్, థరూర్ మధ్య విభేదాలు ఏమిటి?

శశిథరూర్ ఇటీవల ఒక ఆర్టికల్‌లో కేరళ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. ప్రధానమంత్రి అమెరికా పర్యటనపై సైతం ప్రశంసలు కురిపించారు. వీటిపై కాంగ్రెస్ పార్టీ గుర్రుమంటోందనే ప్రచారం జరుగుతోంది. దీనిపై థరూర్ ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ, తాను 16 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ప్రభుత్వంలో తమ పార్టీ ప్రభుత్వం ఉన్నా, ఇతర పార్టీ ప్రభుత్వం ఉన్నా మంచి పనులు చేస్తే ప్రశంసించడం, తప్పు చేస్తే నిలదీయడం తన నైజమని చెప్పారు. కేరళలోని ప్రస్తుత లెఫ్ట్ హయాంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వృద్ధి గురించి ఒక ఆర్టికల్‌లో చెప్పానే కానీ ప్రభుత్వం గురించి కాదని వివరించారు. ప్రభుత్వం చేయాల్సిందే చాలానే ఉందని అన్నారు. గ్లోబల్ స్టార్టప్ ఎకోసిస్టమ్ రిపోర్ట్ 2024 ఆధారంగా వాస్తవ నిజాలు, లెక్కలను తన ఆర్టికల్‌లో ప్రస్తావించానని తెలిపారు. ఆర్టికల్ మొత్తం చదవి మాట్లాడాలే కానీ ఏదో ఒక లైను ఆధారంగా చేసుకుని కామెంట్ చేయడం సరికాదని ఆయన అన్నారు. అందులో పార్టీ రాజకీయాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదని, ఆర్థిక దివాళా నుంచి రాష్ట్రం బయటపడాల్సిన అవసరాన్ని తన 16 ఏళ్ల రాజకీయ జీవితంలో పదేపదే చెబుతూ వస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో తన పాత్ర ఏమిటనే విషయంలో క్లారిటీ లేకపోవడంతో శశిథరూర్ అసంతృప్తితో ఉన్నారనే వార్తలు కొద్దికాలంగా వినిపిస్తున్నాయి. పార్లమెంటులో కీలక డిబేట్‌లలో పాల్గొనే అవకాశం ఇవ్వడం లేదని, సమస్యను పరిష్కరించడంలో రాహుల్ గాంధీ విఫలమయ్యారని ఆయన అసంతృప్తితో ఉన్నట్టు చెబుతున్నారు.

**రాహుల్‌ను కలిసిన శశిథరూర్**

కాగా, శశిథరూర్ రాసిన ఆర్టికల్‌పై కేరళ కాంగ్రెస్ యూనిట్ విమర్శలు గుప్పించిందన్న వార్తల నేపథ్యంలో రాహుల్ గాంధీని గత మంగళవారంనాడు శశిథరూర్ కలుసుకున్నారు. రాహుల్‌తో చక్కటి సంభాషణ జరిగిందని సమావేశానంతరం శశిథరూర్ తెలిపారు. సమావేశంలో ఏ అంశాలు చర్చకు వచ్చాయనే వివరాలను ఆయన దాటవేశారు. పార్టీ తనను పక్కకు పెట్టడంతో అసంతృప్తిగా ఉన్నారా అని అడిగినప్పుడు.. తాను ఎప్పుడూ ఎవరైనా ఫిర్యాదు చేయలేదని ఆయన క్లుప్తంగా సమాధానమిచ్చారు.

# చవకగా కేన్సర్ మందులు, దేశవ్యాప్తంగా డేకేర్ సెంటర్లు



చతర్పూర్: కేన్సర్ మందులను చవకగా అందుబాటులో తేవడంతో పాటు దేశంలోని అన్ని జిల్లాల్లోనూ కేన్సర్ డేకేర్ సెంటర్లు తెరవాలని కేంద్ర నిర్ణయించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని చతర్పూర్‌లో బాగేశ్వర్ థామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్ట్ ఇన్స్టిరీట్‌కు ప్రధాని ఆదివారంనాడు శంకస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేన్సర్‌తో పోరాడేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో పలు ప్రకటనలు చేశామని గుర్తుచేశారు. కేన్సర్ మందులు చవకగా దొరికేలా చూసేందుకు, మూడేళ్లలో దేశంలోని అన్ని జిల్లాల్లోనే కేన్సర్ డేకేర్ సెంటర్లు తెరిచేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

**మహాకుంభ్‌పై ప్రశంసలు**

ప్రధాని తన ప్రసంగంలో మహాకుంభ్‌ను విజయవంతం చేసేందుకు పారిశుధ్య కార్మికులు, పోలీసులు సిబ్బంది అవిశ్రాంతంగా కృషి చేశారని ప్రశంసించారు. ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన 'గ్రేట్‌కుంభ్' ఇదని అన్నారు. వేలాదిమంది వైద్యులు, వలంటీర్లు అకింతభావంతో, కేవల సేవాభావంతో పనిచేశారని అన్నారు. దేశంలోని మత, సాంస్కృతిక సంప్రదాయాలను విమర్శిస్తున్న వారిపై ప్రధాని నిశిత విమర్శలు గుప్పించారు. కొందరు నేతలు మతాన్ని పరిహసిస్తూ, ప్రజలను విడగొడుతూ, తరచు దేశాన్ని, విశ్వాసాలను బలహీనపరిచే విదేశీ శక్తులకు మద్దతు పలుకుతున్నారని అన్నారు. శతాబ్దాలుగా హిందూయిజాన్ని వ్యతిరేకించే వారు మన నమ్మకాలు, ఆలయాలు, సంస్కృతి, సంప్రదాయాలపై దాడులు చేస్తూనే ఉన్నారని అన్నారు. ప్రగతిశీలక మతాన్ని, ఐక్యతను దెబ్బతీయడమే వారి లక్ష్యంగా ఉందన్నారు. ఈ క్రమంలో దేశంలో ఐక్యతా మంత్రాన్ని జాగృతం చేసేందుకు ధీరేంద్ర శాస్త్రి విశేష కృషి చేశారని, ఆయన చొరవతో ఇప్పుడు కేన్సర్ ఇన్స్టిరీట్ నిర్మాణం జరుగుతోందని చెప్పారు.

**ఒక వార్డుకు ప్రధాని తల్లి పేరు**

భాగేశ్వర్ థామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లోని ఒక వార్డుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తి హీరాబెన్ మోదీ పేరు పెట్టనున్నట్టు ధీరేంద్ర శాస్త్రి ప్రకటించారు. రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో రెండు, మూడేళ్లలో ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. నిస్సహాయులు, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కేన్సర్ పేషెంట్లకు ఉచితంగా ఇక్కడ వైద్య సేవలను అందిస్తామని తెలిపారు.

## ఆప్ విపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి అతిషి



న్యూఢిల్లీ: అసెంబ్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి అతిషి పేరు ఖరారైంది. ఆదివారం మధ్యాహ్నం ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సభ్యుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ తొలి సమావేశంలో లేవనెత్తాల్సిన అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

సమావేశానంతరం ఆప్ నేత గోపాల్ రాయ్ మీడియాతో మాట్లాడుతూ, లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా అతిషిని ఏకగ్రీవంగా నిర్ణయించామని, పార్టీ క్లిష్ట కాలంలో ఢిల్లీ సీఎంగా ఆమె సేవలందించారని ప్రశంసించారు. ఆరోగ్యకరమైన ప్రతిపక్షంగా ఆప్ తన బాధ్యతలను నెరవేరుస్తుందని చెప్పారు.

అతిషి మాట్లాడుతూ, ప్రజలు ఆప్‌కు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారని, బలమైన ప్రతిపక్షం ఎలా పనిచేస్తుందో తాము చూపిస్తామని తెలిపారు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే మహిళలకు ఆర్థిక సాయం అంశాన్ని ఆమోదించి మార్చి 8న నాటికి వారి అకౌంట్లలో రూ. 2,500 వేస్తామని మోదీ హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఈ హామీని అమలయ్యేలా చూడం తమ బాధ్యత అని అతిషి చెప్పారు. ఎన్నికలకు ముందే తాము కాగ్ నివేదికను స్పీకర్‌కు పంపామని, దానిని ఆయన ప్రెజెంట్ చేసినట్టు వాళ్లు (బీజేపీ) గందరగోళం సృష్టించారని తెలిపారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి 24న ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం, కొత్త స్పీకర్ ఎన్నిక ఉంటుంది. బీజేపీ నేత విజేంద్ర గుప్తాను స్పీకర్‌గా నామినేట్ చేశారు. ప్రొటెం స్పీకర్‌గా అరవింద్ సింగ్ లవ్లీని ఎల్జీ నియమించారు. 25వ తేదీన గత ఆప్ ప్రభుత్వం అవినీతి, అవకతవకలపై కాగ్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడతారు.

## మంత్రి మేనల్లుడు, పూల వ్యాపారి మధ్య ఘర్షణ



లక్నో: వీధిలో రద్దీ నేపథ్యంలో మంత్రి మేనల్లుడు, పూల వ్యాపారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రాజీపడ్డారు. అయితే వారు కొట్టుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 22న బీజేపీకి చెందిన మంత్రి సోమేంద్ర తోమర్ మేనల్లుడు నిఖిల్ తోమర్, పూల షాపులతో ఇరుకుగా ఉన్న వీధిలో మహీంద్రా స్కార్పియోను డ్రైవ్ చేశాడు. ఎదురుగా ఈ ఆటో రావడంతో వాహనాన్ని నిలిపాడు. కాగా, వాహనం వెళ్లేందుకు దారి లేకపోవడంతో అక్కడున్న ఒక పూల వ్యాపారితో నిఖిల్ వాగ్వాదానికి దిగాడు. మాటా మాటా పెరుగడంతో ఇది ఘర్షణకు దారి తీసింది. దీంతో నిఖిల్ ఆ వ్యాపారిని కొట్టగా అతడు ప్రతిఘటించాడు. ఆ వ్యాపారికి చెందిన మహిళ కూడా నిఖిల్‌పై తిరగబడింది. దీంతో ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. ఆ తర్వాత నిఖిల్ తన వాహనంలో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మరోవైపు ఈ సంఘటన తర్వాత ఇరువర్గాల వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పరస్పరం ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే కొందరు వ్యక్తుల ప్రమేయంతో వారు రాజీపడ్డారు. ఈ నేపథ్యంలో ఎవరి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. అయితే ఈ ఘర్షణకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.


## నెరవేరిన ఆస్ట్రేలియా వ్యక్తి చివరి కోరిక.. భారత్‌లో మృతదేహం ఖననం



పాట్నా: ఆస్ట్రేలియాకు చెందిన వ్యక్తి చివరి కోరిక నెరవేరింది. భారతదేశం పట్ల ఎంతో ప్రేమ ఉన్న అతడు తన వీలునామాలో అంతిమ కోరికను పేర్కొన్నాడు. తన మృతదేహాన్ని భారత్‌లో ఖననం చేయాలని అభ్యర్థించాడు. 12వ సారి భారత్‌ను సందర్శించిన ఆయన అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి చివరి కోరికను అతడి భార్య నెరవేర్చింది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో నివసించే డోనాల్డ్ సామ్స్‌కు భారత దేశమంటే ఎంతో గౌరవం, ప్రేమ. ఆస్ట్రేలియన్ హైకమాండ్ అధికారిగా ఆయన రిటైర్డ్ అయ్యారు. సామ్స్ తండ్రి బ్రిటీష్ పాలనలో అస్సాంలో పనిచేశారు. కాగా, డోనాల్డ్ సామ్స్ భారత్‌కు వచ్చినప్పుడల్లా తన తండ్రికి నివాళిగా అస్సాంను సందర్శించేవారు. కోల్‌కతా నుంచి పాట్నాకు గంగా నదిలో బోటులో ప్రయాణించే వారు. భారత్‌తో అనుబంధం పెంచుకున్న ఆయన తన వీలునామాలో ప్రత్యేకంగా అభ్యర్థించారు. తన మృతదేహాన్ని భారత్‌లోని స్మశానవాటికలో ఖననం చేయాలని చివరి కోరికగా పేర్కొన్నారు. మరోవైపు 91 ఏళ్ల డోనాల్డ్ సామ్స్ తన భార్య ఆలిస్ సామ్స్‌తో సహా 42 మంది బృందంతో కలిసి ఇటీవల 12వ సారి భారత్‌కు వచ్చారు. యథావిధిగా అస్సాంను ఆయన సందర్శించారు. ఎప్పటి మాదిరిగానే కోల్‌కతా నుంచి పాట్నాకు గంగా నది ద్వారా క్రూయిజ్‌లో ప్రయాణించారు. అయితే ఫిబ్రవరి 21న బోటులో ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించింది. దీంతో ముంగేర్‌లోని కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కాగా, డోనాల్డ్ సామ్స్ మరణం గురించి భారత యంత్రాంగం, ఆస్ట్రేలియా రాయబార కార్యాలయానికి ముంగేర్ జిల్లా అధికారులు సమాచారం ఇచ్చారు. తన భర్త వీలునామాలో పేర్కొన్న ఆయన చివరి కోరికను నెరవేర్చేందుకు సహకరించాలని భార్య ఆలిస్ సామ్స్ ఆస్ట్రేలియా ఎంబసీని అభ్యర్థించింది. అనుమతి పొందడంతో ముంగేర్ జిల్లా యంత్రాంగం ఆ మేరకు ఏర్పాట్లు చేసింది. దీంతో శనివారం చురంబాలోని క్రైస్తవ స్మశానవాటికలో డోనాల్డ్ సామ్స్ మృతదేహాన్ని క్రైస్తవ ఆచారాలతో ఖననం చేశారు. జిల్లా కలెక్టర్ అవ్నిష్ కుమార్ సింగ్ ఈ విషయాన్ని ధృవీకరించారు.

# గంటలు గడుస్తున్న కొద్దీ టెన్షన్

-మొదటిపేజీ తరువాయి
శ్రమిస్తున్నాయి.
శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నల్గొండ జిల్లాకు నీటిని తరలించే ప్రాంతం పూర్తిగా నల్లమల అటవీ ప్రాంతం. పర్యావరణ నిబంధనల మేరకు ఓపెన్ కాలువ తవ్వి పనులు చేయాలంటే కష్టమైన పని. అందుకే టన్నెల్ ద్వారా నీటిని తరలించాని నిర్ణయించారు. ఆయకట్టుకు సాగునీటిని మళ్లించేందుకు నిర్మిస్తున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం దేశంలోనే అతి పెద్దది. ఈ టన్నెల్ నాగర్ కర్నూలు జిల్లాలోని అమ్రాబాద్ మండలం దోమలపెంట దగ్గర మొదలై.. అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి దగ్గర పూర్తవుతుంది.
శ్రీశైలం నీటిమట్టం 826 అడుగుల నుంచి నీటిని మళ్లించేలా.. నాలుగువేల క్యూసెక్కుల సామర్థ్యంతో 43.93 కిలో మీటర్ల దూరం టన్నెల్ బోరింగ్ మిషన్‌తో సొరంగం తవ్వుతున్నారు. దీనిద్వారా వచ్చిన నీటిని డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నింపాలి. శ్రీశైలం వైపు నుంచి చేపట్టిన ఇన్‌లైట్ సొరంగం 13.97 కిలోమీటర్ల తవ్వకం పని పూర్తయింది. నీళ్లు బయటకు వచ్చే ఔట్‌లెట్ వైపు నుంచి 20.4 కి.మీ. దూరం తవ్వారు. మొత్తమ్మీద మరో 9.6 కి.మీ. మేర సొరంగం ఇంకా తవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో పనులు జరుగుతుండగా సొరంగం 14వ కిలోమీటర్ దగ్గర ప్రమాదం జరిగింది.
ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్‌లో భాగంగా డిండి రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీటిని తరలించేందుకు.. 7.130 కిలోమీటర్ల



మేర మరో సొరంగం కూడా చేపట్టారు. ఈ రెండో సొరంగమార్గం ఇప్పటికే తవ్వకం పూర్తయ్యింది. ఇది నల్లగొండ జిల్లా చందంపేట మండల తెల్‌దేవరపల్లి నుంచి నేరెడుగొమ్మ వరకు ఉంది. టీబీఎంతో చేపట్టిన ఈ ప్రధాన సొరంగం పనులే పూర్తి కావాల్సి ఉంది. త్వరలోనే ఇవి పూర్తవుతాయని భావిస్తున్న తరుణంలో జరిగిన ఈ ప్రమాదం.. ప్రాజెక్ట్‌ను మరింత ఆలస్యం చేస్తోంది.

ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల తాగు, సాగు నీటి అవసరాలకు కోసం నిర్మిస్తున్న %ూదీజ% టన్నెల్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. కేంద్ర, రాష్ట్ర సహాయక బృందాలతో రెస్క్యూ ఆపరేషన్ నాన్‌స్టాప్‌గా కొనసాగుతూనే ఉంది. నరకానికి నకలు లాంటి ఆ ప్రాంతంలో ఎనిమిదిమంది చిక్కుకుపోయారు.

# అంతు పట్టని దళపతి వ్యూహం

## ఆత్మ స్తుతి, పరనింద

**హైదరాబాద్ :** నెలల లాంగ్ రెస్ట్ తర్వాత గులాబీ బాస్ జనంలోకి వచ్చారు. పార్టీ ఆఫీస్ లో మీటింగ్ పెట్టారు. ఇంత చేసి భవిష్యత్ పై దిశానిర్దేశం చేస్తారని చాలా మంది గులాబీ లీడర్లు అనుకున్నారు. కానీ కేసీఆర్ మాత్రం తెలంగాణ ఉద్యమ చరిత్ర ? బీఆర్ఎస్ పాత్రపై గంటలు గంటలు మాట్లాడారు. మళ్లీ సెంటిమెంట్ రగిల్చి లాభపడే ఉద్దేశమే తప్ప.. భవిష్యత్ లో ఏం చేద్దాం.. ఎలా ముందుకెళ్దాం అన్న పాయింట్లు లేకుండా పోయాయన్న వాదన వినిపిస్తోంది. ఆత్మ స్తుతి, పరనింద ఇదేనా గులాబీ బాస్ కొత్త సందేశం?మరోసారి తెలంగాణ ఉద్యమ చరిత్ర, అందులో కేసీఆర్ పాత్ర, సెంటిమెంట్ చుట్టూనే మ్యాటర్ మొత్తం తిప్పారు. పార్టీ నేతలతో మాట్లాడిన స్పీచ్ లో ఎక్కువ దానికే కేటాయించారు. ఎక్కడైనా చేసిన పని గెలిపిస్తుంది. నిలబెడుతుంది. ఇంకా ఎన్నాళ్లు సెంటిమెంట్ ను పట్టుకుంటారన్న విమర్శలను ప్రత్యర్థులు వినిపిస్తున్నారు. ఇంత చేసి గత పదేళ్లలో ఉద్యమకారులకు కేసీఆర్ ఏపాటి గౌరవం ఇచ్చారన్న ప్రశ్నలు వచ్చి పడుతున్నాయ్.రాకరాక జనంలోకి వచ్చి పార్టీని ఎలా జనంలోకి తీసుకెళ్లాలన్న విషయంపై దిశానిర్దేశం చేసుకోవాలి. కానీ విస్తృతస్థాయి మీటింగ్ లో అలా జరగలేదు. ఏదో అనుకుని ఇంకేదో చెప్పారా.. అన్న టాక్ ఇంటర్నల్ గా నడుస్తోంది. తమ పాలన భేష్, కాంగ్రెస్ పాలన బేకార్ అన్నట్లుగా మాట్లాడారు. అన్ని రంగాలు పడకేశాయన్నారు. అన్ని వర్గాల వారు రోడ్డున పడ్డారన్నారు. ప్రతిపక్ష నేతగా ఇవన్నీ రొటీన్ డైలాగ్సే. అయితే కొంత వరకైనా కనెక్ట్ అయ్యేలా ఉండాలి కదా అన్న పాయింట్ ను ప్రత్యర్థులు వినిపిస్తున్నారు.బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ఏ పొజిషన్ లో ఉంది. అన్నది కేసీఆర్ చూసుకోవడం లేదా అన్న పాయింట్ కూడా చర్చకు వస్తోంది. నడిపించే నాయకుడు జనానికి దూరంగా.. ఉంటే నష్టం ఎవరికి అన్నది కూడా ఆలోచించడం లేదా అంటున్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి.. ప్రభుత్వం ఏవైనా తప్పులు చేస్తే నిలదీయడం, ఎండగట్టడం, సలహాలు ఇవ్వడం వంటివి కూడా చేయకపోతే ఎలా అన్న పాయింట్ కూడా తెరపైకి వస్తోంది. అంతెందుకు కులగణనలో పాల్గొనకుండా తిరిగి ఆ సర్వేపైనే విమర్శలు చేయడం.. ఇవన్నీ జనం అబ్జర్వ్ చేసే అంశాలే.అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత బీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ మరింతగా పడిపోయింది. తమకు తెలంగాణలో తిరుగే లేదు అనుకున్న గులాబీ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన సీట్లు సున్నా. ఇది ఎవరూ ఊహించలేదు. అయితే రాష్ట్రంలోనే ఓడారు.. ఇక ఎంపీ సీట్లు గెలిపించడం ఎందుకని జనం దూరం పెట్టేశారు. ఇప్పుడు ఏకంగా ఆదిలాబాద్-నిజామాబాద్-కరీంనగర్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి వరుసగా పోటీ పెట్టకపోవడం కూడా వేరే సిగ్నల్స్ ను పార్టీ శ్రేణుల్లోకి, జనంలోకి తీసుకెళ్తోందిఅంతెందుకు ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిధిలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇలా సొంతంగా ప్రాతినిధ్యం వహించే చోట కూడా అభ్యర్థిని పెట్టి తమ స్టామినా ఏ పొజిషన్ లో ఉందో చూసుకోవాల్సిన టైంలో అస్త్ర సన్యాసం ఏంటన్న ప్రశ్నలకు కూడా తాజా మీటింగ్ లో జవాబు రాకుండా పోయింది. బీఆర్ఎస్ టిక్కెట్ వస్తుందని నమ్ముకున్న రవీందర్ సింగ్ లాంటి లీడర్లు.. ఇండిపెండెంట్ గా నామినేషన్లు వేసుకున్నారు. ఇదేనా గులాబీ బాస్ తమ లీడర్లు, క్యాడర్ కు ఇచ్చుకునే సందేశం?సో తిరిగి పుంజుకున్నాం.. జనంలోనే ఉన్నాం.. అని చెప్పుకోవాల్సిన పోటీలో దూరం ఉండడం గులాబీ పార్టీకి చాలా నష్టం చేసే అంశం. కేసీఆర్



అధికారంలో ఉన్నప్పుడు కూడా ఫాంహౌజ్ సీఎం అన్న ప్రచారం జరిగి అది ఓటమికి దారి తీసింది. ఇప్పుడు కూడా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధ్యక్షుడిగా ముందుండి నడపాల్సిన టైంలో ఏకంగా 7 నెలల గ్యాప్ తర్వాత ఫాంహౌజ్ నుంచి బయటకు వచ్చారు. ఇలా జరిగితే క్యాడర్ లో జోష్ పెరిగేదెలా.. లీడర్లలో ఉత్సాహం వచ్చేదెలా అన్నది గులాబీ పార్టీలో ఇంటర్నల్ గా జరుగుతున్న డిబేట్. పనిలో పనిగా కాంగ్రెస్ నేతలు కూడా కేసీఆర్ సీజనల్ పొలిటీషియన్ అంటూ, ఆయన ఫాంహౌజ్ లో పర్మినెంట్ గా రెస్ట్ తీసుకుంటేనే బెటర్ అని కౌంటర్లు కూడా ఇస్తున్నారు.అయిపోయిందనుకున్న పార్టీలు లేచాయి. లేచిన పార్టీలు పడిపోయిన సందర్భాలు చరిత్రలో ఉన్నాయి. అయితే తెలంగాణలో మాత్రం బీఆర్ఎస్ స్పేస్ ను బీజేపీ క్రమంగా ఆక్రమిస్తూ వస్తోంది. ఇది ఆ పార్టీకి అన్నిటికంటే పెద్ద సవాల్. అలాంటి విషయాలపై దిశానిర్దేశాలు లేకుండా పోవడమే పెద్ద మైనస్ అన్న టాక్ ఆ పార్టీలోనే వినిపిస్తోంది.కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 ఎంపీ సీట్లున్నా నిధులు తేలేదన్నారు కేసీఆర్. మరి అదే అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లి.. ఎన్నిసార్లు ప్రధానిని కలిశారన్న పాయింట్ వినిపిస్తోంది. అటు కృష్ణా జలాలను కాపాడుకోవడం తెలియట్లేదన్నారు. మరి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సంగమేశ్వరం పనులు జరుగుతుంటే ఏం చేశారన్న ప్రశ్న తెరపైకి వస్తోంది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట్ల బైపోల్స్ రావడం ఖాయమే అంటున్నారు కేసీఆర్. బైపోల్స్ కు పోటీ చేసే ఉత్సాహం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లేదా.. ధైర్యం చాలట్లేదా.. గతంలో బలం ఉన్నా ప్రత్యర్థి పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ఎందుకు లాగేశారన్న ప్రశ్నలకు జవాబులు లేవు.పార్టీ పని అయిపోయిందని సొంత పార్టీ వాళ్లే ప్రచారం చేయడంతోనే పది మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయారని కేసీఆర్ మీటింగ్ లో అన్నారు. కానీ అక్కడ జరిగింది నిజంగా అదే ఫ్యాక్టరా.. అంటే కాదన్న జవాబు వస్తోంది. మరోవైపు కేసీఆర్ పవర్ లో ఉన్నప్పుడు కేంద్రంతో అంటీ ముట్టనట్లు ఉండడం, ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చినా కనీసం వెళ్లి కలవకపోవడం, అలక పాన్పు ఎక్కడం, ఎడమొహం పెడమొహం అన్నట్లుగా డీల్ చేయడం ఇవన్నీ జరిగాయి. కేంద్రంతో గట్టిగా కొట్లాడలేదు.. అడగాల్సినవి అడగలేదు. ఫాలోఅప్ చేయాల్సినవి చేయలేదు.. మరి వచ్చేవి ఎలా వస్తాయన్న ప్రశ్నలకు జవాబు లేకుండా పోయింది.ఇంత చేసి తాజా విస్తృతస్థాయి మీటింగ్ లో గులాబీ బాస్ బీజేపీపై ఒక్క మాట కూడా మాట్లాడలేదంటున్నారు. ఇంతకు ముందు కూడా బీజేపీని పెద్దగా టార్గెట్ చేయడం లేదు. బీజేపీ ఇప్పుడు బీఆర్ఎస్ కు డేంజర్ గా మారింది. బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బీజేపీకే వెళ్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లోనే ఇది క్లారిఫై అయింది. అలాంటప్పుడు బీజేపీ విషయంలో సాఫ్ట్ గా ఉంటే ఇంకా సమస్యలు ఎదురవుతాయి. కానీ కేసీఆర్ మాత్రం బీజేపీని టార్గెట్ చేసే పరిస్థితిలో కూడా లేరంటున్నారు.
అంతెందుకు ఉత్తర తెలంగాణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ పెట్టకుండా బీజేపీకి పరోక్షంగా సపోర్ట్ ఇస్తున్నారన్నది కాంగ్రెస్ నేతల విమర్శ. ఇలా ఎన్ని కౌంటర్లు పడ్డా.., మాట మాత్రం మాట్లాడడం లేదు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో వరుస ఓటములతో పార్టీ లీడర్స్, క్యాడర్ అంతా నైరాశ్యంలో ఉండడంతోనే ఎమ్మెల్సీకి పోటీ పెట్టడం లేదని ఓవైపు గులాబీ లీడర్లు చెబుతుంటే.. ఉప ఎన్నికలకు రెడీ అవ్వాలని, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని కేసీఆర్ ఎలా చెబుతారన్న ప్రశ్నలకు మాత్రం జవాబు ఇవ్వలేని పరిస్థితి.పరిస్థితి చూస్తుంటే.. పోటీ చేయకపోయినా పర్వాలేదు.. ఓడినా పర్వాలేదు.. కానీ అధికార పార్టీ మాత్రం గెలవొద్దు ఇప్పుడు గులాబీ నాయకత్వం ఇదే కాన్సెప్ట్ తో పని చేస్తోందా అన్న డౌట్లు కూడా వస్తున్నాయి. సో ఫైనల్ గా కేసీఆర్ రాజకీయ వ్యూహాలను తక్కువ అంచనా వేయడానికి లేదు. అలాగని సీరియస్ గా తీసుకోవాల్సిన పని కూడా లేదన్నది ప్రత్యర్థుల మాటే. ఎందుకంటే ఆ వ్యూహాలకు కాలం చెల్లిపోయిందంటున్నారు. ఎన్ని చేసినా కథ మారదని గుర్తు చేస్తున్నారు. అయినా ఆశ ఉంటుంది కదా.

## ఆ విషయాలు గుర్తుకు తెచ్చుకుని బండి సంజయ్ ఎమోషనల్

**వరంగల్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రజల పక్షాన, ఉపాధ్యాయుల కోసం ఏనాడైనా ఉద్యమాలు చేశారా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. తాము ప్రజల కోసం ఉద్యమాలు చేశాం, లాఠీ దెబ్బలు తిన్నామని గుర్తుచేశారు. అయినా బీజేపీకి ప్రజలు ఓట్లు వేయలేదు... ఎన్నికల్లో గెలిపించలేదని చెప్పారు. పేద ప్రజల సమస్యల కోసం ఎందుకు పని చేయాలని బీజేపీ కార్యకర్తలు తమను ప్రశ్నిస్తున్నారని బండి సంజయ్ కుమార్ చెప్పారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ సారి బీజేపీ బలపర్చిన వారికి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేస్తే ఏమి వచ్చిందని నిలదీశారు. ఇవాళ(ఆదివారం) బండి సంజయ్ వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... రేవంత్ ప్రభుత్వం రేషన్ కార్డు, ఇల్లు ఇచ్చిందా అని ప్రశ్నించారు. మరి ఎందుకు కాంగ్రెస్‌కు ఓటు వేస్తున్నారని అడిగారు. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారికే ఓటు వేయాలని..

## కాంగ్రెస్ పార్టీని ఎవ్వరూ నమ్మడం లేదు

-మొదటిపేజీ తరువాయి
ఆ పార్టీ గెలవడం లేదని ఎద్దేవా చశారు. నిజమైన మార్పు తెలంగాణలో రాలేదని విమర్శించారు. తెలంగాణలో పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 27వ తేదీన జరగనున్నాయి. వీటి ఫలితాలు మార్చి 3వ తేదీన వెలువడనున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. అయితే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు రంగంలోకి దిగలేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ.. బీజేపీ అభ్యర్థులకు మద్దతు ఇస్తుందంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుంటే.. కాదు కాదు.. బీఆర్ఎస్ పార్టీ.. కాంగ్రెస్ పార్టీ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇస్తుందంటూ బీజేపీ నేతలు విమర్శలు ప్రతి విమర్శలు చేసుకొంటున్నారు. అలాంటి వేళ ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి.

## ఉప ఎన్నికల్లో గెలుపు మాదే..



-మొదటిపేజీ తరువాయి
మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కొమురవెల్లి మల్లన్న క్షేత్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేశాం.త్రాగు నీరు,వసతి గదులు,బంగారు కిరీటం వంటి అనేక విధాలుగా మల్లన్న ఆలయం అభివృద్ధి చేశాం. కేసీఆర్ హయాంలో మల్లన్న ఆలయాన్ని అభివృద్ధి చేశారు కాబట్టే గతంలో సుమారు ఐదు కోట్లు ఉన్న ఆదాయం .. ఇప్పుడు గణనీయంగా సుమారు 20కోట్లకు పైగా చేరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14నెలలు అవుతున్న రైతులు, సబ్బండ వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు,420హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క గ్యారెంటీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హనీమూన్ పిరియడ్ అయిపోయింది. ఇకపై ప్రజల ఇబ్బందులపై శ్రద్ధ చూపాలి. కులగణనపై ఏ కుల సంఘాల నాయకులు సంతృప్తి లేరు. కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యే పెట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రజలు ప్రభుత్వ విధానాలను అన్ని గమనిస్తున్నారు. రాష్ట్ర జనాభా 4కోట్లకు పైగా జనాభా ఉంటే ప్రభుత్వం 3కోట్ల 70లక్షలుగా చూపిస్తుంది. కులగణనపై హడావిడిగా అసెంబ్లీలో చేయాల్సి తీర్మానం చేయాల్సిన అవసరం లేదు.గతంలోనే మాజీ సిఎం కేసీఆర్ అసెంబ్లీలో కులగణనపై తీర్మానం ప్రవేశ పెట్టారు. మేడిగడ్డలో చిన్న సమస్య వస్తే భూతద్దంలో పెట్టి చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎల్బిసి సొరంగం ఘటనపై ఎవరు భాధ్యత వహిస్తారు. నోరు ఉందిగా అని ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. కేసీఆర్ దూరదృష్టి తోనే ప్రాజెక్టులను నిర్మించి రైతులకు అండగా నిలబడ్డారు. అన్నివర్గాల ప్రజలను కదిలిస్తే ఏ ప్రభుత్వం ప్రజలకోసం పనిచేసింది వాళ్ళే చెబుతారు. న్యాయస్థానం తీర్పు మేరకే పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానంలో ఉప ఎన్నికలు రావడం ఖాయం,ఆ ఎన్నికల్లో గెలుపు తమదేనని జోస్యం చెప్పారు

## యాదాద్రిలో స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరించిన సీఎం రేవంత్

-మొదటిపేజీ తరువాయి
భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా పంచతుల బంగారు విమాన గోపురాన్ని ఆవిష్కరించారు సీఎం రేవంత్. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం, ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మహాకుంభ సంప్రోక్షణ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దివ్య విమాన స్వర్ణ గోపుర ఆవిష్కరణకు సంబంధించి 'పంచ కుండాత్మక మహా కుంభాభిషేక సంప్రోక్షణ' మహోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు.. మహాపూర్ణాహుతిలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో రేవంత్ దంపతులకు వేదపండితులు ఆశీర్వాదం ఇచ్చారు.
ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు వెళ్లిన సీఎం.. మొదటగా గుట్టపైన ఉన్న యాగశాలకు చేరుకున్నారు. ఆలయ ఈవో, అధికారులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ఆలయ పరిసరాలు, అభివృద్ధి పనులు పర్యవేక్షించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## వెంటనే ఏపీలో రిపోర్ట్ చేయండి ఐపీఎస్ ఆఫీసర్లకు ఆదేశం

**హైదరాబాద్ :** తెలంగాణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ముగ్గురు ఐపీఎస్‌లకు కేంద్ర హోం శాఖ షాకిచ్చింది. ప్రస్తుతం ఉన్న పోస్టుల నుంచి రిలీవ్ చేస్తూ.. 24 గంటల్లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ ముగ్గురు ఐపీఎస్‌లు ఎవరంటే.. అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి. ఈ ముగ్గురిని వెంటనే రిలీవ్ చేయాలని హోం శాఖ ఆదేశాలిచ్చింది. డీజీ అంజనీ కుమార్ ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు. ఆయన తెలంగాణ డీజీపీగా కూడా గతంలో పనిచేశారు. అభిషేక్ మహంతి ప్రస్తుతం కరీంనగర్ సీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అభిలాష బిస్త్ తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అంజనీ కుమార్, అభిలాష బిస్త్ డీజీ ర్యాంక్‌లో ఉండగా, అభిషేక్ మహంతి ఎస్పీ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.ఈ ముగ్గురికి కేవలం 24 గంటల సమయం మాత్రమే ఇచ్చిన కేంద్ర హోం శాఖ వెంటనే ఏపీ ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఆదేశాలపై ఐపీఎస్‌లు కొంత సమయం కావాలని కోరే అవకాశం ఉంది. మూడు నెలల క్రితం ముగ్గురు ఐఏఎస్ అధికారులను ఇలాగే బదిలీ చేసింది కేంద్ర ప్రభుత్వం. తాజాగా ఈ ముగ్గురు ఐపీఎస్‌లకు షాక్ ఇచ్చింది. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి వీళ్లు ఇక్కడే ఉన్నారు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో ఈ ముగ్గురిని కూడా కేంద్రం ఏపీకి అలాట్ చేసింది. కానీ, ఆ నిర్ణయాన్ని వీరు ముగ్గురు సవాల్ చేస్తూ క్యాట్‌ని ఆశ్రయించారు. అక్కడ వీరి అలాట్‌మెంట్‌కు సంబంధించిన వాదనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

## భారీగా పెరిగిన ఎక్స్ ఛార్జీలు

**హైదరాబాద్ :** భారత ఎక్స్ యూజర్లకు ప్రపంచ కుబేరుడు ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ పెద్ద షాక్ ఇచ్చాడు. ఎక్స్ ప్రీమియం + సబ్‌స్క్రిప్షన్ ధరలను భారత్‌లో భారీగా పెంచేశాడు. ఈ పెంపుతో గతంలో ఉన్న ధరలకు ఈ ధరలు రెంట్టిపు కానున్నాయి. మరోవైపు ఇప్పటికే ఒకసారి ఎక్స్ ప్రీమియం + చార్జీలను పెంచారు. మూడు నెలల వ్యవధిలో రెండోసారి చార్జీలు పెంచేశారు. మస్క్ తీరుపై ఎక్స్ యూజర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రోక్3 ఏఐ విడుదల తర్వాత ఎక్స్ ప్రీమియం + సబ్‌స్క్రిప్షన్ చార్జీలు పెంచడం గమనార్హం.మస్క్‌కు చెందిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్కు సంబంధించిన స్టార్టప్ సంస్థ ఎక్స్‌ఏఐ తాజాగా గ్రోక్3 సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇక ఈ ఎక్స్‌ఏఐని వినియోగించాలంటే ఎక్స్ ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని గ్రోక్3 ప్రారంభించిన సమయంలోనే మస్క్ వెల్లడించాడు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీమియ్ + సబ్‌స్క్రిప్షన్ ధరలు పెంచేశారు.ఇప్పటి వరకు ఇండియాలో ప్రీమియమ్ + సబ్‌స్క్రిప్షన్ ధర నెలకు రూ.1,750గా ఉంది. తాజా పెంపుతో అది రూ.3,470కి చేరింది. అంటే ఈ ప్లాన్ ధరలు దాదాపు రెట్టింపు పెరిగాయి. ఇక ఏడాది మొత్తానికి తీసుకునే ప్లాన్ ధరను రూ.18,300 నుంచి రూ.34,340కి పెంచింది.

## సంపాదకీయం

# ఉదారతకు ట్రంప్ వీడ్కోలు!

రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కింది మొదలు వ్యవస్థల్ని ఎడాపెడా తొక్కుకుంటూ పోతున్న డోనాల్డ్ ట్రంప్ దృష్టి ప్రపంచ దేశాలకు ఉదారంగా సాయం అందించే అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (యూఎస్ ఎయిడ్)పై పడింది. గత నెల 27నే ఆ సంస్థ కార్యకలాపాలను నిలిపేస్తూ ఆయన ఉత్తర్వులిచ్చారు. దాన్నుంచి విడుదలయ్యే నిధుల గురించి సమీక్షించి ఆ పంపిణీని 'మరింత సమర్థంగా', తమ విదేశాంగ విధానానికి అనుగుణంగా వుండేలా రూపుదిద్దుతామని ఆ సందర్భంగా ప్రకటించారు. ఇప్పుడు దాని తాలూకు సెగలూ పొగలూ మన దేశాన్ని కూడా తాకాయి. ఆ సంస్థ నుంచి లబ్ధి పొందింది 'మీరంటే మీర'ని బీజేపీ, కాంగ్రెస్‌లు వాదులాడుకుంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో గాలించి గత చరిత్ర తవ్వి పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. వెనకా ముందూ చూడకుండా దూరవగా దూసుకెళ్లే బీజేపీయే ఈ వాగ్యుద్ధానికి అంకు రార్పణ చేసింది. కాంగ్రెస్, మరికొన్ని పౌర సమాజ సంస్థలూ యూఎస్ ఎయిడ్ నుంచి దండిగా నిధులు పొందాయన్నది బీజేపీ ఆరోపణల సారాంశం. పనిలో పనిగా ప్రపంచ కుబేరుడు జార్జి సోరోస్‌తో కాంగ్రెస్‌కున్న సంబంధాలు మరోసారి ప్రస్తావనకొచ్చాయి. జార్జి సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నుంచి యూఎస్ ఎయిడ్‌కు ప్రధానంగా నిధులు వస్తాయి గనుక దాన్నుంచి నిధులందుకున్నవారంతా మచ్చపడినవారేనని బీజేపీ అభియోగం. కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మరో అడుగు ముందుకేసి యూఎస్ ఎయిడ్ నిధులతోనే ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచే నిరసనోద్యమాలు దేశంలో గత కొన్నేళ్లుగా నడుస్తున్నాయని తేల్చారు. దేశద్రోహులు అనే మాటైతే వాడలేదుగానీ... ఆ చట్రంలో ఇమిడే కార్యకలాపాలన్నిటినీ పరోక్షంగా కాంగ్రెస్‌కూ, ఇతర సంస్థలకూ అంటగడుతూ ఏకరువు పెట్టారు. అటు కాంగ్రెస్ ఊరుకోలేదు. కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ ఒకప్పుడు యూఎస్ ఎయిడ్ రాయబారిగా పనిచేయటం, నీతి ఆయోగ్, స్వచ్ఛభారత్ వంటి సంస్థలకు నిధులు రావటం వగైరాలను ప్రస్తావించింది. వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యా లయం వెబ్‌సైట్ సమాచారం ప్రకారం యూఎస్ ఎయిడ్ మన ప్రాథమిక విద్య, ఉపాధ్యాయ శిక్షణ, వ్యవసాయం, తాగునీరు, ఇంధనం వగైరాలకు సాయపడుతున్నది. ఇదంతా చూస్తుంటే 'గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏర డం' నానుడి గుర్తుకొస్తుంది. 1961లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ ఏలుబడిలో ప్రారంభమైన ఈ సంస్థనుంచి నిధులందుకున్న పార్టీలూ, స్వచ్ఛంద సంస్థలూ కొల్లలుగా ఉన్నాయని భావించవచ్చు. ప్రభుత్వ కార్యక్రమా లకు కూడా అది సాయపడింది. అమెరికా తన బడ్జెట్‌లో ఒక శాతాన్ని అంతర్జాతీయ సాయానికి కేటాయిస్తున్నది. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రపంచంలో అత్యధిక మానవతా సాయాన్ని అందించే ఏకైక దేశం అమెరికాయే. అంతర్జాతీయంగా నిరుడు వివిధ దేశాలకు అందిన సాయంలో అమెరికా వాటా 40 శాతం. 2025 ఆర్థిక సంవత్సరానికి యూఎస్ ఎయిడ్ ద్వారా 5,840 కోట్ల డాలర్లు వ్యయం కావొచ్చన్న అంచనా ఉంది. ట్రంప్ ప్రస్తుతం దాన్ని నిలుపుదల చేశారు గనుక ఇందులో ఎంత మొత్తానికి కత్తెరపడుతుందో అంచనా వేయటం కష్టం. మనకైతే ఇకపై రాక పోవచ్చు. ఎందుకంటే ట్రంప్ ఉద్దేశంలో భారత్ సంపన్న దేశం. 2021 నుంచి నిరుడు డిసెంబర్ వరకూ మన దేశానికి 2 కోట్ల డాలర్లు కేటాయించగా అందులో కోటీ 25 లక్షల డాలర్లు అందించి నట్టు లెక్కలున్నాయి. ఇదంతా 'ప్రజాతంత్ర భాగస్వామ్యం', పౌర సమాజం కోసం అని యూఎస్ ఎయిడ్ అంటున్నది. ఇందులో 55 లక్షల డాలర్లు నిరుడు జరిగిన ఎన్నికల్లో పెద్దయెత్తున వోటర్లు పాల్గొనేలా చూడటానికి అందించారు. ఏ సంస్థ ఎంత పొందిందన్న వివరాలు మాత్రం లేవు. దక్షిణ అమెరికాలో అమెజాన్ అడవుల రక్షణ, ఆఫ్రికాలో వ్యాధులు అరికట్టడానికి, ఆడపిల్లల విద్యకు, ఉచిత మధ్యాహ్న భోజనానికి సాయం చేయగా... రష్యా ఇరుగు పొరుగు దేశాల్లో దాని ప్రభావం తగ్గించటానికి, యుద్ధక్షేత్రమైన సిరియాలో ఆస్పత్రుల కోసం, ఉగాండాలో అట్టడుగు తెగల అభ్యున్నతికి, కంబోడియాలో మందుపాతరల తొలగింపునకు, బంగ్లాలో పౌరసమాజం కోసం... ఇలా భిన్నమైన పథకాలకూ, కార్యక్రమాలకూ అమెరికా తోడ్పడుతోంది. అసలు ఎవరైనా ఎందుకు సాయం చేస్తారు? వ్యక్తుల వరకూ చూస్తే తమ ఎదుగుదలకు కారణమైన సమాజానికి తిరిగి ఏదో ఇవ్వాలన్న కృతజ్ఞతా భావన కారణం కావొచ్చు. కానీ ఏ ఉద్దేశమూ లేకుండా అయా చితంగా ఖండాంతరాల్లోని సంపన్న దేశాలు వేరే దేశాలకు ఎందుకు తోడ్పాటునిస్తున్నాయి? చరిత్ర తిరగేస్తే దీని వెనకున్న మతలబు అర్థమవుతుంది. అప్పట్లో సోవియెట్ యూనియన్ ప్రభావం నుంచి ప్రపంచాన్ని 'రక్షించే' బాధ్యత తన భుజస్కంధాలపై వేసుకుని అమెరికా ఈ సాయం మొద లెట్టింది. అటు సోవియెట్ సైతం ఆ పనే చేసేది. ప్రపంచం దాదాపు రెండు శిబిరాలుగా చీలిన ఆ కాలంలో అమెరికా, సోవియెట్‌లకు ఈ ఉదారత ఎందుకంటిందో సులభంగానే గ్రహించవచ్చు. సాధారణ ప్రజానీకంలో తమపట్ల అనుకూల భావన కలిగితే అవతలివారిని సగం జయించినట్టేనని ఆ రెండు దేశాలూ భావించేవి. ప్రపంచ దేశాలన్నీ ప్రత్యర్థులుగా కనబడుతున్న వర్తమానంలో అమెరికాకు ఉదారత అవసరం ఏముంది? 'నేను ఆదేశించింది పాటించటమే తప్ప నాతో తర్కానికి దిగొద్ద'ని ట్రంప్ స్వయంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మనదేశం ఈ సాయాన్ని ముందే తిరస్కరించి ఉంటే ఎంతో హుందాగా ఉండేది. కానీ ఇవ్వబోమని అమర్యాదకరంగా చెప్పించుకోవటం ఆత్మాభిమానం గల భారతీయులందరికీ చివుక్కుమనిపించే సంగతి. పాలకులు గ్రహిస్తారా?

# చెదిరిపోతున్న ఐటీ కల

గత రెండు దశాబ్దాలుగా మధ్యతరగతి ప్రజల మనస్తత్వాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. మరింత మెరుగైన జీవితాన్ని ఆశిస్తున్న తల్లిదండ్రులు తాము కష్టపడుతూ పిల్లలను ఐటీ ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని కలలుగన్నారు. తమ పిల్లాడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని చెప్పుకోవాలని ఉవ్విళ్లూరారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వారి ఆశలను చిదిమేస్తున్నది. భవిష్యత్తులో ఐటీ ఉద్యోగాలను కృత్రిమ మేధ అమాంతం మింగేస్తుందన్న భయాలు నెలకొన్నాయి. ఇన్ఫోసిస్ మైసూర్ క్యాంపస్ ఇటీవల 400 మంది ట్రైనీ ఉద్యోగులను తొలగించడం ఏఐ ఇస్తున్న హెచ్చరికగానే భావించాలి. నిజానికి భారత్‌లో అత్యధిక వేతనాలు చెల్లిస్తున్నది ఐటీ రంగమే. అయితే, కృత్రిమ మేధ రాకతో ఇప్పుడు దీనిని గత చరిత్రగానే చెప్పుకోవాలి. నెలకు రూ.20 వేల నుంచి రూ. 25 వేలు అందుకున్న ఇద్దరు ఫ్రెషర్ల స్థానంలో రూ. 17 వేలు మాత్రమే చెల్లించి ఏఐతో వారి సేవలను భర్తీ చేసుకునే వెసులుబాటు ఇప్పుడు ఐటీ కంపెనీలకు లభించింది. అదే నెలకు రూ. 17,500 ఖర్చు చేస్తే పీహెచ్‌డీ స్థాయి ఏఐ ఏజెంట్‌ను యాక్సెస్ చేసుకొని నెలకు రూ. 70 వేల నుంచి రూ. లక్ష వేతనం చెల్లిస్తున్న ఉద్యోగులను భర్తీ చేసుకోవచ్చు. బడా ఐటీ కంపెనీలకు ఈ విషయం రెండేండ్ల క్రితమే తెలుసు. 2022 ఏడాది చివరలో వచ్చిన 'చాట్‌జీపీటీ' ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో పెను ప్రకంపనలే సృష్టించింది. టెక్ కంపెనీలకు ఇది ఒక రకంగా వరం కాగా, మరో రకంగా ముప్పు కూడా పొంచి ఉన్నది. మరీ ముఖ్యంగా భారత్‌లోని ఐటీ కంపెనీలకు ఏఐ భయం పట్టుకుంది. ఇక్కడి సంస్థల్లో చాలావరకు విదేశీ కంపెనీలకు పనిచేస్తాయి. వారికి కావాల్సిన విధంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి అందిస్తాయి. వారి డాటాను డిజిటలైజ్ చేస్తాయి. అయితే, ఇప్పుడు విదేశీ కంపెనీలు భారత్‌కు ఔట్ సోర్సింగ్ ఇవ్వడానికి బదులు చాట్‌జీపీటీకే ఆ పని అప్పగించే అవకాశం ఉన్నది. 'స్టెబిలిటీ ఏఐ' రూపకర్త ఇమాద్ మొస్టాక్ 2023 జూలైలోనే ఈ పరిణామాన్ని అంచనా వేశారు. ఏఐ వల్ల తొలుత ఉద్యోగాలు కోల్పోయేది భారత్‌లోని ఐటీ కోడర్లేనని హెచ్చరించారు. భారత్‌లోని కోడ్ రైటర్ల కంటే ఏఐ మరింత మెరుగ్గా పనిచేస్తుందని, భారతీయ కంపెనీలు ఇందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. గత రెండేండ్లుగా చూసుకుంటే ఐటీ ఉద్యోగాల సంఖ్య క్రమంగా పడిపోతున్నది. దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో వంటివి 2023-24 నుంచి ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నాయి. వేతన పెంపుదలను కూడా ఆలస్యం చేస్తున్నాయి. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) గణాంకాల ప్రకారం.. క్లరికల్ స్టాఫ్, టెక్నీషియన్లు కాకుండా ఇండియాలో దాదాపు రెండు కోట్ల మంది వైట్‌కాలర్ ఉద్యోగాలు చేస్తున్నారు. మేజర్ ఐటీ కంపెనీల్లో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా టాప్-5లో కొనసాగుతున్నాయి. ఐటీ ఉద్యోగాలు సాధిస్తే తమ బతుకులు గాడిన పడతాయన్న ఆశతో దేశంలోని మధ్యతరగతి ప్రజలు తమ పిల్లలను కంప్యూటర్ సైన్స్ డిగ్రీ



వైపు బలవంతంగా పంపుతున్నారు. ఇందుకోసం సంపాదించుకున్న మొత్తాన్ని ఐటీ చదువులకు వెచ్చిస్తున్నారు. దేశంలో ప్రస్తుతం13 లక్షల మంది విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ కోర్సులు చేస్తున్నారు. నిజానికి ఐటీ జాబ్ సౌకర్యవంతమైన జీవితానికి గ్యారెంటీ మాత్రమే కాదు.. విదేశాల్లో, మరీ ముఖ్యంగా అమెరికా వంటి దేశాల్లో ఉద్యోగానికి అది తలుపులు తెరుస్తుంది. విదేశీ కంపెనీలు భారత్‌లోని టెక్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడం వెనుక బలమైన కారణమే ఉంది. ఎందుకంటే భారత్‌లోని టెక్ కంపెనీలు చాలా తక్కువ ధరకే ప్రాజెక్టులు చేసి పెడతాయి. దీనినిబట్టి అర్థం చేసుకోవాల్సింది ఒకటి ఉంది. రానున్న రోజుల్లో ఐటీ రంగంలో ఉద్యోగాలు పెరిగినా వేతనం మాత్రం తగ్గుతుంది. ప్రస్తుతం పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్లకు మధ్యస్థంగా నెలకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేల వరకు ఆఫర్ చేస్తున్నాయి. పదేండ్ల క్రితంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. 2015లో వాస్తవ కొనుగోలు శక్తి రూ. 25 వేలు ఉంటే ప్రస్తుతం అది రూ. 40 వేలుగా ఉన్నది. అప్పట్లో వేతన పెంపు కూడాఎక్కువగా ఉండటంతోపాటు క్రమం తప్పకుండా ఉండేది. ఇప్పుడా స్థాయికి చేరుకోవాలంటే చాలా కాలం పడుతుంది.

'బ్లూమ్‌బర్గ్' సర్వే ప్రకారం వచ్చే కొన్ని సంవత్సరాల్లో వాల్‌స్ట్రీట్‌లో ఏకంగా 2 లక్షల ఉద్యోగాలు మాయమయ్యే అవకాశం ఉన్నది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో సగానికి పైగా ఉద్యోగాలను ఏఐ మింగేస్తుందని సర్వే అంచనా వేసింది. భారత్‌లోని మధ్యతరగతికి ఇది మరో ఎదురుదెబ్బనే చెప్పాలి. ఎందుకంటే వైట్‌కాలర్ ఉద్యోగాల్లో ఎక్కువ శాతం ఆర్థిక రంగంలోనే ఉన్నాయి. ఇక, తాజా పరిణామాలు మధ్యతరగతికి ఒక గుణపాఠంగానే భావించాలి. పిల్లలకు ఇష్టం లేకున్నా కంప్యూటర్ సైన్స్ వైపే వెళ్లాలంటూ వారిపై ఒత్తిడి తీసుకురావడం మానుకోవాలి. గత రెండు దశాబ్దాలుగా ఐటీ ఉద్యోగాలు స్థిరంగా పెరుగుతున్నప్పటికీ, సూపర్ టాలెంట్ ఉంటే తప్ప ఇప్పుడు మనుగడ సాగించలేని పరిస్థితులున్నాయి. అయితే, ఇది ఒక్క ఇండియాకే పరిమితమైన సమస్య కాదు. ప్రతి చోటా ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. అమెరికాలో కొవిడ్‌కు ముందున్న కాలంతో పోలిస్తే సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ ఉద్యోగాలు 35 శాతం పడిపోయాయి. ముఖ్యంగా చాట్ జీపీటీ వచ్చాక ఉద్యోగాల్లో క్షీణత మొదలైంది. మరో చేదు నిజం ఏంటంటే.. ఏఐ ప్రభావం ఒక్క టెక్ రంగానికే పరిమితం కాదు, ప్రతి రంగంలోనూ ఇది ఉద్యోగాలను భర్తీ చేయగలదు. 'బ్లూమ్‌బర్గ్' సర్వే ప్రకారం వచ్చే కొన్ని సంవత్సరాల్లో వాల్‌స్ట్రీట్‌లో ఏకంగా 2 లక్షల ఉద్యోగాలు మాయమయ్యే అవకాశం ఉన్నది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో సగానికి పైగా ఉద్యోగాలను ఏఐ మింగేస్తుందని సర్వే అంచనా వేసింది. భారత్‌లోని మధ్యతరగతికి ఇది మరో ఎదురుదెబ్బనే చెప్పాలి. ఎందుకంటే వైట్‌కాలర్ ఉద్యోగాల్లో ఎక్కువ శాతం ఆర్థిక రంగంలోనే ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి ఒక తరం.. వారి తల్లిదండ్రుల కంటే తక్కువ సంపాదించే ప్రమాదంలో పడింది. ఉద్యోగాలు రాని యువతీయువకులు వారి తల్లిదండ్రులపైనే ఆధారపడతారు. వివాహాలు ఆలస్యమవుతాయి. ఇది వారిని మానసికంగా కుంగదీస్తుంది. నిరాశ పెరుగుతుంది. చిన్నచిన్న విషయాలకే గొడవలు పడటం సర్వసాధారణం అయిపోతుంది. భారతదేశంలో నాలుగు దశాబ్దాలుగా మధ్యతరగతి ప్రజలు ఐటీ కలల చుట్టూనే తిరుగుతున్నారు. కాబట్టి తర్వాతి తరమైనా ఆనందంగా జీవించాల్సిన అవసరం ఉన్నది. స్నేహితులతో గడపడం, పార్కులో ఓ సాయంత్రం అలా వాకింగ్ చేయడం, పుస్తకం చదవడం, ఆడిపాడటం ద్వారా ఆనందాన్ని వెతుక్కోవాలి. సూర్యుడు ఉదయించడానికి ముందు వచ్చే చీకటి కాలానికి మధ్యతరగతి ప్రజలు సిద్ధంగా ఉండాలి.

# దీనావస్థలో యూరప్ దేశాలు

కళ్లముందు ప్రమాదకర సంకేతాలు కనబడుతున్నా అమెరికాను గుడ్డిగా అనుసరిస్తూ పోవటం అలవాటు చేసుకున్న యూరప్‌కి డోనాల్డ్ ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక వరస షాక్‌లు తప్పడం లేదు. గతవారం జర్మనీలో జరిగిన మ్యూనిక్ భద్రతా సదస్సుకొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'వాక్ స్వాతంత్ర్యానికీ, ప్రజాస్వామ్యానికీ మీవల్లే ముప్పు ముంచుకొస్తున్నద'ని యూరప్ దేశాలపై విరుచుకుపడ్డారు.

దాన్నుంచి తేరుకోకముందే ఆ దేశాల ప్రమేయం లేకుండా ఉక్రెయిన్ యుద్ధం నిలుపుదలపై రష్యాతో సౌదీ అరేబియాలోని రియాద్‌లో అమెరికా భేటీ అయింది. యూరప్ వరకూ ఎందుకు... రష్యాతో రెండేళ్లుగా సాగుతున్న యుద్ధంలో శిథిలావస్థకు చేరిన ఉక్రె యిన్‌నే ఆ చర్చలకు ఆహ్వానించలేదు. యుద్ధం ఆపడానికి అవకాశాలున్నాయా, ఆ విషయంలో తొలి అడుగువేయటం అసలు సాధ్యమేనా అనే అంశాలను నిర్ధారించుకోవటానికే రియాద్ సమా వేశం జరిగిందని అమెరికా విదేశాంగశాఖ సంజాయిషీ ఇస్తున్నా దాని వ్యవహారశైలి యూరప్ దేశా లకు మింగుడు పడటం లేదు. ఆ విషయంలో నిజంగా చిత్తశుద్ధి వుంటే రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడటానికి ముందు ట్రంప్ యూరప్ దేశాల అధినేతలను సంప్రదించేవారు. దాదాపు ఎనభైయ్యేళ్లుగా యూరప్ దేశాలన్నీ అమెరికా అడుగుజాడల్లో నడిచాయి. రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ సైన్యాన్ని మట్టికరిపించిన సోవియెట్ సేనలు తూర్పు యూరప్ దేశాల తర్వాత తమవైపే చొచ్చుకొస్తాయని, తాము బలికావటం ఖాయమని పశ్చిమ యూరప్ దేశాలు వణికిపోయాయి. నాటి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ దీన్ని చక్కగా వినియోగించుకుని ఉత్తర అమెరికా ఖండంలో తన పొరుగు దేశమైన కెనడాను కలుపుకొని పశ్చిమ యూరప్ దేశాలతో జత కట్టి పటిష్ఠమైన సైనిక కూటమి నాటోకు అంకురార్పణ చేశారు. అమెరికా%-%సోవియెట్‌ల మధ్య సాగే పోటీలో యూరప్ దేశాలు అవసరం లేకున్నా తలదూర్చాయి. ఆర్థికవ్యవస్థలు అనుమతించక పోయినా తమ తమ జీడీపీల్లో రెండు శాతం నాటో కోసం వ్యయం చేశాయి. యూరప్ భూభాగంలో అణ్వాయుధాల మోహరింపు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, మారణాయుధాలు జోరందుకున్నాయి. యూరప్ దేశాలకు ఆనాటి సోవియెట్ నుంచి లేదా ప్రస్తుత రష్యా నుంచి ఎన్నడూ ముప్పు కలగలేదుగానీ... నాటోవల్ల లిబియా, సిరియా, అఫ్గానిస్తాన్, సూడాన్, సోమాలియా తది తర దేశాలు అస్థిరత్వంలోకి జారుకుని ఉగ్రవాదం వేళ్లూనుకుంది. సిరియావంటి దేశాల్లో ప్రభుత్వా లను కూలదోసేందుకు



విచ్చలవిడిగా ఆయుధాలందించటంవల్ల ఐసిస్ అనే భయంకర ఉగ్రవాద సంస్థ ఆవిర్భవించింది. ఉక్రెయిన్ దురాక్రమణకు రష్యాను రెచ్చగొట్టింది కూడా యూరప్ దేశాలే. 2013లో అమెరికా ప్రోద్బలంతో ఉక్రెయిన్‌తో ఆర్థిక ఒప్పందం కుదుర్చుకోవటంతోపాటు ఐఎంఎఫ్ రుణం పొందేందుకు సహకరించింది ఈయూ దేశాల కూటమే.

అయితే ఐఎంఎఫ్ కఠిన షరతులను తిరస్కరించి రష్యా ఇచ్చే 1,500 కోట్ల డాలర్ల రుణం తీసుకోవటానికి అప్పటి ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యనుకోవిచ్ నిర్ణయించటంతో దేశంలో ప్రజా ఉద్యమం పేరిట తిరుగుబాటుకు అంకు రార్పణచేసి అస్థిరపరచటంలో అమెరికా, ఈయూల పాత్ర వుంది.

ఈ పరిణామాలే పుతిన్‌ను క్రిమియా ఆక్రమణకు పురిగొల్పాయి. ఎన్నికల్లో చట్టబద్ధంగా గెలిచిన యనుకోవిచ్‌ను ఈ వంక చూపి 2019లో కూలదోసి, సినీ నటుడు జెలెన్‌స్కీని అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టడం, పర్యవసానంగా మూడేళ్లక్రితం పుతిన్ ఉక్రెయిన్‌పై దండెత్తటం వర్తమాన చరిత్ర.

యుద్ధంపై తమ ప్రమేయం లేని చర్చల్ని గుర్తించబోనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యూరప్ దేశాలకు కనీసం ఆ మాత్రం ధైర్యం కూడా లేదు. తాజా పరిణామాల నేప థ్యంలో ఏం చేయాలో చర్చించటానికి ఫ్రాన్స్ చొరవతో సోమవారం పారిస్‌లో జరిగిన అత్యవసర భేటీకి అరడజను దేశాలు హాజరయ్యాయి. అవి కూడా కింకర్తవ్య విచికిత్సలో పడ్డాయి. ఉక్రెయిన్‌కు శాంతి సేనలను పంపటానికి తాను సిద్ధమని ప్రకటించిన బ్రిటన్... ఆ వెంటనే 'అమెరికా అందుకు అనుమతిస్తేనే' అని ముక్తాయించింది. ఈలోగా జర్మనీ, పోలాండ్, స్పెయిన్‌లు దాన్ని అసందర్భ ప్రతిపాదనగా కొట్టిపారేశాయి. అమెరికా తాజా వైఖరితో యూరప్ స్వీయరక్షణ కోసం సొంతంగా సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న ప్రతిపాదనపై సైతం అనుకూల స్వరాలు వినబడటంలేదు. ట్రంప్ ఆగమనం తర్వాత అమెరికాతో యూరప్ దేశాల సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్న అభిప్రాయం అందరిలో ఏర్పడింది. దీనికితోడు ట్రంప్ అనుచరగణం యూరప్‌లో తీవ్ర మితవాద పక్షాలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం వివిధ దేశాధినేతలకు ఉంది. ట్రంప్ వైఖరి ఎలా వుంటుందన్న అంశంలో ఆయన తొలి ఏలుబడిలో యూరప్ దేశాలకు తగినంత అవగాహన వచ్చింది. కానీ దశాబ్దాల తరబడి అమెరికా అనుసరిస్తున్న విధానాలను రెండో దఫాలో మెరుపువేగంతో ఆయన తిరగరాస్తారని ఆ దేశాలు ఊహించలేదు. ఈసారి ట్రంప్ వెనకున్న ఎలాన్ మస్క్, స్టీవ్ బానన్, మార్కో రుబియో తదితరులతోపాటు సమర్థుడైన దూతగా పేరున్న విట్‌కాఫ్‌లే అందుకు కారణం కావొచ్చు. పర్యవసానంగా ట్రంప్ రంగప్రవేశం చేసి నెల తిరగకుండానే యూరప్ దేశాలకు ప్రపంచం తలకిందులైన భావన కలిగింది. స్వతంత్రంగా ఎదగటానికి ప్రయత్నించక కీలుబొమ్మల్లా వ్యవహరించిన ఆ దేశాలు ఇప్పటికైనా వివేకం తెచ్చుకోవాలి. సొంత ఆలోచనతో, స్వీయప్రయోజనాల కోసం పనిచేయటం నేర్చుకోవాలి. రోజులు ఎప్పుడూ ఒకేలా వుండవని గ్రహించాలి.

# ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునేందుకు నిర్విరామంగా కృషి చేయాలి







**గురుకులాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి..**

**గురుకులంలో మంజూరు చేసిన మరమ్మత్తు పనులు వేగవంతంగా పూర్తి చేయాలి..**

**మంథని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో రాత్రి బస నిర్వహించి,పిల్లలతో ముచ్చటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి బ్యూరో,మంథని,ఫిబ్రవరి23(సూర్యరేఖ)** ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునేందుకు నిర్విరామంగా కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని పట్టణం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలురు)లో నైట్ హాల్ట్ నిర్వహించారు. గురుకులం లో చదువుతున్న పిల్లలతో కలెక్టర్ (ముఖాముఖి) ఇంటరాక్ట్ అయ్యారు.గురుకులంలో అందిస్తున్న భోజనం నాణ్యత, విద్య,ఇతర వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే నాణ్యమైన విద్యా విధానం గురించి,విద్యార్థుల విజయం కోసం తయారు చేసినటువంటి పరీక్ష ప్రణాళిక విధానాన్ని తెలుసుకొని, విద్యార్థులకు పరీక్షలకు అనుకూలంగా తయారు చేసినటువంటి ప్రణాళికను పరిశీలించి, పరీక్షల సమయంలో ధైర్యంగా ఉండాలని విద్యార్థులకు ఆయన సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ. ప్రతి విద్యార్థికి జీవితంలో ఒక గొప్ప లక్ష్యం ఉండాలని, దాని సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.మన లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలో ప్రణాళిక తయారు చేసుకొని క్రమ పద్ధతిన ఆ దిశగా పయనించాలని,ఒకే రోజు అద్భుత ఫలితాలు సాధించడం కుదరదని,నిరంతర శ్రమతోనే ఉన్నత శిఖరాలు చేరుకుంటామని కలెక్టర్ తెలిపారు.గురుకులంలో మరమ్మత్తు పనుల మంజూరైన నిధులు పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని కలెక్టర్ సూచించారు.అనంతరం పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ (భోజనం)డిన్నర్ చేసి విద్యార్థులకు అందించే భోజన నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ మెనూ తూ.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులతో కలిసి శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ హాస్టల్లోనే నిద్రించారు.

**ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్..**

శనివారం రాత్రి మంథనిలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉన్నారో లేదో తెలుసుకున్నారు.ఆస్పత్రికి వచ్చిన వివిధ పేషంట్లతో మాట్లాడారు.వారి సమస్యలు,వారికి అందుతున్న చికిత్సపై ఆరా తీశారు.వైద్యులు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని,ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని గురుకులం ప్రిన్సిపాల్ వి.శ్రీనాథ్,ఉపాధ్యాయ సిబ్బంది,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికతో..చదివితే విజయం మీదే..



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మి ఫోటో.



రామాయంపేట బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రాధిక ఫోటో.



బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం రమ ఫోటో.



రామయంపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హాల్పాహారం చేస్తున్న విద్యార్థులు



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని

మెరుగైన ఫలితాల కోసం పాఠశాలలో ప్రత్యేక తరగతులు.. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..
ఉత్తమ ఫలితాలను సాధించడానికి విద్యార్థుల కసరత్తు..
విద్యార్థుల జీవితాలను మలుపు తిప్పే పదవ తరగతి వార్షికపరీక్షలు సమీపిస్తున్నాయి.ఈ క్రమంలో పరీక్షల్లో సత్తా చాటడానికి విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించడానికి ఉపాధ్యాయులు ఇప్పటి నుంచి కసరత్తు ప్రారంభించారు. పాఠశాలవేళలకు భిన్నంగా ఉదయం సాయంత్రం వేళలో పాఠశాలల్లో అదనంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యార్థులపై "సూర్యరేఖ" ప్రత్యేక కథనం..

**రామాయంపేట,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** మార్చి 21 నుండి జరిగే పదవ తరగతి వార్షిక పరీక్ష లలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడం కోసం రామాయంపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.ఉత్తమ ఫలితాలను సాధించడానికి విద్యార్థులు కసరత్తు చేస్తున్నారు.ప్రతిరోజు ఉదయం పాఠశాల సమయానికి గంట ముందు సాయంత్రం పాఠశాల సమయం అనంతరం గంట పాటు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి చదివిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.విద్యార్థులు మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికను సిద్ధం చేసుకుని చదువుతున్నారు. రామాయంపేట బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. రోజుకు ఒక సబ్జెక్ట్ టీచర్ అందుబాటులో ఉండి పాఠ్యాంశాల వారిగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ప్రత్యేక తరగతుల నిర్వహణ ఫలితాల సాధనకై విద్యార్థులు ఉపాధ్యాయులు శ్రమిస్తూన్నారు.ప్రీ ప్రైమరీ ఫైనల్ పరీక్షలలో ప్రతిభ కనబరిస్తే పబ్లిక్ పరీక్షలను నిర్భయంగా ఎదుర్కొనవచ్చని రామయంపేట ప్రభుత్వ పాఠశాల సబ్జెక్టుల ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉదయం సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి అత్యున్నత ఫలితాలు సాధించడానికి కసరత్తు చేస్తున్నారు. గత సంవత్సరం రిజల్ట్ ను దృష్టిలో ఉంచుకొని ఈసారి మంచి ఫలితాలను సాధించడానికి పోటీపడుతున్నారు.

**ప్రణాళికా పరంగా తరగతులు..**

విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలువాలన్న లక్ష్యంతో ప్రణాళిక బద్ధంగా ఉపాధ్యాయులు ముందుకు సాగుతున్నారు.ఈ ప్రత్యేక తరగతులను ఉదయం సాయంత్రం సమయంలో నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.మాదిరి ప్రశ్నపత్రాలను రూపొందించి సాధన చేస్తున్నారు.పదవ తరగతి పరీక్షలలో 100% ఉత్తీర్ణత సాధించాలంటే ముందస్తు ప్రణాళిక ఎంతో అవసరం.పరీక్షలకు తక్కువ సమయం ఉండడంతో ఇప్పటివరకు చాలా పాఠశాలలో సిలబస్ పూర్తయింది.గతంలోలాగే మంచి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులను ప్రణాళికా. బద్ధంగా పరీక్షలకు సంసిద్ధం చేస్తున్నారు.

**– హెచ్ఎం.రమ,రామాయంపేట**

విద్యార్థులకు రెండు రకాల స్నాక్స్ అందించడం జరుగుతుంది.ప్రతిరోజు ఉడకబెట్టిన పెసర్లు,పల్లీలు బెల్లం, చిరుధాన్యాలతో చేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఉడకబెట్టిన బొబ్బర్లు,ఉల్లిపాయ పకోడీ,ఉడకబెట్టిన శనిగలతో రోజుకు ఒక రకం అందించడం జరుగుతుంది.విద్యార్థులకు బలమైన ఆహారాన్ని అందించడంతోపాటు ప్రైవేట్ కు దీటుగా మార్కులు వచ్చేలా కృషి చేస్తున్నాం. సాధ్యమైనంతవరకు ఉత్తమ ఫలితాలు వచ్చేలా విద్యార్థులకు బోధిస్తున్నాం........విద్యార్థులు కూడా శ్రద్ధతో చదువుకుంటున్నారు.

**– భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయురాలు రాధిక, రామాయంపేట**

ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయడం జరుగుతుంది.ఈ క్రమంలో విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుంది.ప్రతి సబ్జెక్టు కాగానే ఏవైనా అనుమానాలు ఉంటే తెలపాలని సూచిస్తున్నాం..ప్రతి సబ్జెక్టు కాగానే విద్యార్థులను ప్రశ్నించి ఏవైనా సందేహాలు ఉంటే చెప్పాలని వివరిస్తున్నాము.ప్రతి సబ్జెక్టులో పూర్తి అవగాహన ఉండి ప్రతి ప్రశ్నకు సమాధానం రాసే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్నాం..

**– లక్ష్మి సోషల్ ఉపాధ్యాయురాలు,రామాయంపేట**

సోషల్ లో 100% ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం..పదికి పది సాధించడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం..పరీక్షలలో విద్యార్థులు అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించడం కోసం బాలికల ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులను నిర్వహిస్తున్నాం..

**– విద్యార్థిని ఉన్నత పాఠశాల,రామయంపేట**

మాకు చదువు చక్కగా చెబుతున్నారు.స్నాక్స్ కూడా బాగున్నాయి.సులభంగా అర్థమయ్యే పదికి పది సాధించేలా బోధిస్తున్నారు.ఉపాధ్యాయులు కూడా మంచి సపోర్టుగా ఉన్నారు.మంచి మార్కులు సాధించి మా ఉపాధ్యాయులతో పాటు పాఠశాలకు మంచి పేరు తీసుకువస్తాం..

**– విద్యార్థిని, ఉన్నత పాఠశాల,రామాయంపేట.**

సందేహాలు నివృత్తి ప్రతిరోజు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నాం బృందాలుగా చర్చలు నిర్వహించడం వల్ల పాఠ్యాంశంలోని సందేహాలు నివృత్తి అవుతున్నాయి.పరీక్షల సమయం దగ్గర పడడంతో కష్టపడి చదువుతున్నాం. ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి సలహాలు అందించడంతో పాటు ప్రోత్సహిస్తున్నారు.

## నేడు కలెక్టరేట్ లో జరిగే ప్రజావాణి కార్యక్రమం రద్దు..


**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**




**పెద్దపల్లి బ్యూరో,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** పెద్దపల్లి కలెక్టరేట్ లో ఈనెల 24వ తేదీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావద్దని విజ్ఞప్తి చేశారు.ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో అధికారులంతా క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండం..

**ఎమ్మెల్యే గడ్డం వినోద్**



**బెల్లంపల్లి,ఫిబ్రవరి 24 (సూర్యరేఖ)** మెదక్,నిజామాబాద్,ఆదిలాబాద్,కరీంనగర్, పట్టబద్దుల ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డిని గెలిపించండని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలి.బెల్లంపల్లి పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బెల్లంపల్లి పట్టణ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టభద్రులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గురించి దిశా నిర్దేశం చేసి పట్టభద్రులంతా అల్ఫోర్స్ వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరవేసే విధంగా పనిచేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్రంలో నిరుద్యోగులకు,పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో ముందుకు పోతుందన్నారు.రానున్న రోజుల్లో నిరుద్యోగులకు అనేక ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికను సీఎం రేవంత్ రెడ్డి సిద్ధం చేస్తుందన్నారు.గడిచిన ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదని తెలిపారు.పట్టపద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ బండి ప్రభాకర్ యాదవ్,పట్టణ అధ్యక్షులు ముత్యాల మల్లయ్య, కాంగ్రెస్ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్వేతా శ్రీధర్,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి టూ గ్రౌండ్ లో క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే వినోద్



**బెల్లంపల్లి,ఫిబ్రవరి 24 (సూర్యరేఖ)** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి క్రికెట్ బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు.పట్టణంలోని ఏఎంసి గ్రౌండ్లో బెల్లంపల్లి ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ బ్యాట్తో క్రికెట్ ఆట ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో అలరించిన సద్గురు త్యాగరాజ ఆరాధన ఉత్సవం..




**ఉప్పల్,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం వాగ్దేవి సంగీత విద్యాలయం గురువులు తాడేపల్లి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ ఆరాధన ఉత్సవం నిర్వహించారు. వీణపై సుధాకర్,వేణువుపై దత్తాత్రేయులు,రామ్ మోహన్ , మృదంగం జయకుమార ఆచార్య,కీబోర్డ్ కిరణ్ సహకరించారు.సంగీత కళాకారులూ సరితా,పద్మ, హైమావతి, శృతి,జనార్ధన్,శ్రీకర్,మౌక్తిక,శ్రీనివాస్, అన్నపూర్ణ,దాక్షాయణి,శృతి,శ్రావ్య,లక్ష్మి,అన్నపూర్ణ, అభిలాష్ మొదలైన వారు త్యాగరాజ కీర్తనలుతులసి దళములతో నగుమోము,పంచరత్న కృతులు ఎందరో మహానుభావులు,జగదానంద కారక, సాధించెనే,దుడుకుగల కనకన రుచిరా మొదలైన కృతులను ఆలపించారు.

# రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ గా ప్రొఫెసర్ బసవరావు నియామకం హర్షణీయం





## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్,ఫిబ్రవరి 23 (సూర్యరేఖ)** మూడు దశాబ్దాల కాలంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు బోధించిన ప్రొఫెసర్ వెంకట బసవరావు కర్నూల్ లోని రాయలసీమ యూనివర్సిటీకి వైస్ ఛాన్స్ లర్ గా నియామకం కావడం పట్ల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.కాప్రా సర్కిల్ మీర్పేట్ హౌసింగ్ బోర్డు పరిధిలోని తిరుమలనగర్ లోని ఆయన నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రొఫెసర్ బసవరావును ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తాను సారధ్యం వహించే ఉప్పల్ నియోజకవర్గంలో నివాసముండే ప్రొఫెసర్ బసవరావు రాయలసీమ యూనివర్సిటీకి వైస్ ఛాన్స్ లర్ బాధ్యతలు నిర్వహించడం తనకెంతో గర్వంగా ఉందన్నారు.మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్ లు జెర్రిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి,లు మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధిలో ప్రొఫెసర్ బసవరావు సూచనలు సలహాలతో ముందుకు వెళ్లే వారమని గుర్తు చేసుకున్నారు.తిరుమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు వైస్ ఛాన్స్ లర్ బసవరావును శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ భాస్కర్, తిరుమలానగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మల్లేష్,అమర్,శేఖర్, వేణు,తదితరులు పాల్గొన్నారు.

## జడ్ చెరువు తాండ చెరువుకు రక్షణ కల్పించండి..

**స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన మత్స్యకారులు**




**నిజాంపేట,ఫిబ్రవరి23(సూర్యరేఖ)** మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారులు(ముదిరాజ్) తమకు సంబంధించిన జెడ్ చెరువు తాండలోని చెరువులో చేపలు పడుతున్నారని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మత్స్యకారుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ...జడ్ చెరువు తండాలో గ్రామానికి చెందిన రామావత్ రాజు,రమావత్ రామోజీ,రమావత్ శ్రీనివాస్,లు చెరువులో వలలు వేసి చేపలు పట్టుకోవడం జరుగుతుందని ఆవేదన గురయ్యారు.గతంలో కూడా ఇదేవిధంగా చేపలు పట్టుకొనగా పెద్దల సమక్షంలో మందలించిన మళ్లీ చేపలు పట్టడం మారడం లేదని ఇట్టి వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మత్స్యకారులు( ముదిరాజ్) సంఘ సభ్యులుదురుగొల్ల రాజు,స్వామి, మల్లేశం,శ్రీనివాస్, రవి,లింగం,మల్లయ్య,చెంద్రం,బాలయ్య,శంకర్, ముత్తయ్య,సాయిలు, మహేష్,యాదగిరి, ఎల్లం,చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## "నేటి - మాట"

**కొల్చారం,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** పేదలు ఇంకెన్నడు పెద్దోళ్ళు అయ్యేది' బీదరికపు చీకట్లు తొలిగిపోయి పున్నమి వెన్నెల నిండే రోజులు ఇంకెప్పుడు దరిచేరుతాయి..ఇప్పటికి కూటి కోసం గూడు కోసం ఉపాధికోసం బతుకుపోరాటం చేస్తున్న మధ్యతరగతి జీవితాలు ఎన్నడు బాగుపడుతాయి. ఏ ప్రభుత్వాలు పేదరికాన్ని నిర్మూలించేది. రాజకీయాలు పుట్టినప్పటి నుండి అన్ని పార్టీలు పేదల తలరాతలు మారుస్తామని దేశంలో పేదరికమే లేకుండా చేస్తామని దొంగ వాగ్దానాలు చేసి గద్దెనెక్కుతున్నారు..పేదప్రజలకు మేలు చేయడం మర్చిపోయి-అధికారాన్ని అడ్డం పెట్టుకోని విచ్చలవిడిగా అవినీతి చేసే నాయకులు కొద్దికాలంలోనే కోట్లకుపడిగేలేత్తుతున్నారు. చెమటచుక్కల్ని రాల్చకుండా ఒళ్ళంచి పనిచేయని లీడర్లు లగ్జరీలైఫ్ ను ఎంజాయ్ చేస్తు ప్రజలు కట్టిన పన్నులతో లక్షల్లో జీతం తీసుకుంటూ..అన్ని అలావెన్స్లు పొందుతూ రాచమర్యాదలు అనుభవిస్తున్నారు మేమింకా ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చామని పేదరికాన్ని నిర్మూలిస్తామని నీతులు చెప్పుతున్నారు.

## సొంత పార్టీలోకి తిరిగి చేరిన సెగ్గం రాజేష్..

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు**



**పెద్దపల్లి బ్యూరో,ఫిబ్రవరి 23 (సూర్యరేఖ)** పెద్దపల్లి జిల్లా మంథని బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది.అ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి సెగ్గం రాజేష్ శనివారం రాత్రి కరీంనగర్ లో మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.రాజేష్ కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ పార్టీని మమ్ములను నమ్ముకుని వచ్చేవారికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు.తనపై నమ్మకంతో పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి శ్రీధర్ బాబుకు,యువ నాయకుడు శ్రీనుబాబుకు సెగ్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో ఒక సైనికుడిలా ఇకనుంచి పనిచేస్తానని రాజేష్ అన్నారు

## నేతాజీనగర్ లో ఉచిత వైద్య శిభిరం..



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 23** నేతా జీనగర్ లో జరిగిన ఉచిత వైద్య శిబి రం దివంగత డాక్ట ర్స్ సీతారాం జ్ఞాప కార్థం చంద్ర హా స్పిటల్ ఆధ్వర్యం లో డాక్టర్ భరత్ రెడ్డి,ఆయన సతీమ ణి డాక్టర్ నరితా రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణులు, స్త్రీ,వైద్య నిపుణురాలు, కార్డియాలజిస్ట్ డాక్టర్ సోహెబ్, అలాగే జనరల్ ఫిజీషియన్ డెంటిస్ట్ ఈ కార్యక్రమంలో ఉచితంగా సేవలందించారు. ఉచిత మందులు ఉచిత గుండెకు సంబంధించిన ఈసీజీ టు డి ఈకో టెస్టులో పేషెంట్లకు ఉచితంగా రక్త పరీక్షలు చేసి వారికి సరైన సూచనలు, మెడిసిన్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్ కృష్ణ గౌడ్,సుధాకర్ గౌడ్,జైపాల్, దత్తు, కుమార్ యాదవ్,తదితర గ్రామ పెద్దలు స్థానిక డాక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం దాదాపుగా 300 మంది పేషెంట్లు ట్రీట్మెంట్ అందించారు.

## బెల్లంపల్లిలో ఘనంగా సేవాలాల్ జయంతి ఉత్సవాలు





**పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి,ఫిబ్రవరి 24 (సూర్యరేఖ)**సేవాలాల్ బంజారా సమాజ,సాంస్కృతిక, ఆధ్యాత్మిక అభ్యున్నతికి విశేష సేవలు అందించారని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కొనియాడారు. బంజారాల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ సద్గుర్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాల్లో. సేవాలాల్ మహారాజ్,జగదాంబ అమ్మవారికి, మేరమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవాల సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో లంబాడీలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద లంబాడీల సాంప్రదాయ బద్ధంగా ఆటపాటలతో,డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేశారు. సేవాలాల్ జయంతి ఉత్సవాల కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి భారీ ఎత్తున లంబాడీలు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి





## కార్పొరేటర్ కక్కిరేణి చేతన

**ఉప్పల్,ఫిబ్రవరి 23 (సూర్యరేఖ)** హబ్సిగూడ డివిజన్ లోని వీధి నెంబర్ -7 దగ్గర డాక్టర్ ధీరజ్ పెయిన్ రిలీఫ్ సెంటర్ ని హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన ఆదివారం సంద ర్శించారు.డాక్టర్ ధీరజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా రోగులకు పరీక్షలు అందిస్తున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ధీరజ్ ని కార్పొరేటర్ అభినందిస్తూ రోగులకి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచిం చారు. కార్పొరేట్ కాలంలో తనవంతు బాధ్యతగా ఒకరోజు ఉచితంగా రోగులను పరీక్షించడం చాలా సంతోషమని కార్పోరేటర్ డాక్టర్ని అభినందించారు. నిరుపేదలకు ప్రతినెల ఒక రోజు ఉచిత వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా వారికి సూచించారు.ఈ సందర్భంగా డాక్టర్ ధీరజ్ పెయిన్ రిలీఫ్ సెంటర్ ప్రతినిధులు కార్పొరేటర్ ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చెల్లోజు ఎల్లాచారి, పెంటం శైలేందర్,కట్ట భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

## పట్నాల మహోత్సవంలో పాల్గొన్న ఏగోలపు సదయ్య గౌడ్





**పెద్దపల్లి బ్యూరో,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామంలో కత్తెరసాల మల్లన్న స్వామి పట్నాల మహోత్సవ కార్యక్రమంలో బీజేపి పార్టీ రాష్ట్ర యువ నాయకుడు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్ పాల్గొన్నారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా సదయ్య గౌడ్ మాట్లాడుతూ...కత్తెరసాల మల్లన్న స్వామి దీవెనలతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాల తో,అష్టైశ్వర్యాలతో,సుఖ సంతోషాలతో, పాడి పంటలతో సువిశాలంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో తూడి రాజేందర్,అవుల మల్లేశ్ యాదవ్, బండ మల్లయ్య యాదవ్,రాజు యాదవ్,కిట్టవెని కొమురయ్య యాదవ్, ఎల్లయ్య యాదవ్,గోగురి ఐలయ్య యాదవ్,బండ శ్రీనివాస్ యాదవ్,అధిక సంఖ్యలో భక్తులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని యూనియన్ లీడర్ మోసం..

**మోసపోయానని తెలిసి లబోదిబోమంటున్న బాధితుడు..**

**న్యాయం చేయాలనీ "సూర్యరేఖ దినపత్రిక"ను వేడుకున్న బాధితుడు..**



**పెద్దపల్లి బ్యూరో,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** పెద్దపల్లి జిల్లా సింగరేణి ఆర్జీ2లో తోటమాలి సెక్షన్ లో ఉద్యోగం పెట్టిస్తానని 8 ఇంక్లైన్ కాలనీకి చెందిన ఓ యూనియన్ లీడర్ లక్ష రూపాయల డబ్బులు తీసుకొని మోసం చేశారని,డబ్బులు ఇవ్వమంటే బెదిరిస్తున్నాడని పూసాల విజయ తన భర్త యుగేందర్ లు కలిసి ఆదివారం గోదావరిఖనిలో ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్జీ 2 డివిజన్?కు చెందిన ఓ యూనియన్ నాయకుడు 8 వ కాలనీ రాజీవ్ నగర్ కు చెందిన యుగేందర్ వద్ద నుండి అవుట్సోర్సింగ్,కాంట్రాక్టు పద్ధతిన తోటమాలి సెక్షన్ లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి లక్ష రూపాయలు తీసుకున్నాడు. కానీ ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడు.దాంతో డబ్బులు ఇవ్వమని అడిగితే ఏమి చేసుకుంటావో చేసుకో అని బెదిరిస్తున్నాడని బాధితుడు వాపోయాడు.ఇళ్లల్లో కూలి పని చేసుకునే తమకు ఉద్యోగం ఇప్పిస్తానంటే ఒంటిపై ఉన్న బంగారం అమ్ముకొని లక్ష రూపాయలు ఇచ్చామని చెప్పారు.ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని బాధితుడు "సూర్యరేఖ దినపత్రిక"తో తన గోడు వెల్లబోసుకున్నాడు.

## వామ్మో పెద్దపులి..!

**తాడిచర్ల అడవి ప్రాంతంలో ఆవును హతమార్చిన పెద్దపులి..**

**భయాందోళనలో మంథని నియోజకవర్గ గ్రామాల ప్రజలు..**

**పెద్దపులి ఆనవాళ్ళ కోసం అటవీ ప్రాంతాల్లో జల్లడ పడుతున్న అటవీశాఖ అధికారులు..**





**మంథని,పెద్దపల్లి బ్యూరో, ఫిబ్రవరి 23 (సూర్యరేఖ)** భూపాలపల్లి - పెద్దపల్లి జిల్లా సరిహద్దులోని మల్హర్ మండలం తాడిచెర్ల కాపురం చెరువు అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున పెద్దపులి ఆవును హతమార్చింది. పెద్దపులి అటవీ ప్రాంతంలో తిరుగుతుందన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన పెద్దపులి ఆనవాళ్ళ కోసం అటవీ ప్రాంతాల్లో అధికారులు జల్లడ పడుతున్నారు.గత మూడు సంవత్సరాల క్రితం పెద్దపులి భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మానేరు దాటి పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్ గ్రామం నుంచి ఖమ్మంపెల్లి వెల్గల పహాడ్ అటవీ ప్రాంతం నుంచి మచ్చుపేట బగుళ్ల గుట్ట అటవీ ప్రాంతంలో ఆవును హతమార్చింది.దీంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమై పెద్దపులి అడుగులతో సమాచారం తెలుసుకొని,పులిని జిల్లాలోని అంతర్గాం మండలంలోని అటవీ ప్రాంతం మీదుగా మహారాష్ట్రకు తరలించారు.దీంతో ఇప్పుడు పెద్దపులి ఇదే అటవీ ప్రాంతాలైన భూపాలపల్లి జిల్లా నుంచే వస్తుండడంతో అప్పటి పులే మళ్ళీ ఇప్పుడు వస్తుందా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి,మనుషులపై దాడి చేయకముందే పెద్దపులిని బంధించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# ఐక్యమత్యానికి స్నేహాభావానికి క్రీడలు దోహదం





**ఘనంగా వర్త్యావత్ రూప్లి భాయి జ్ఞాపకార్థంగా క్రికెట్ టోర్నమెంట్..**
**హాజరైన ప్రారంభించిన రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి**
**క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి..**
**గ్రామ యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి..**

**యాచారం,ఫిబ్రవరి23(సూర్యరేఖ)** క్రీడలు దేహదారుడ్యానికి మానసిక ఉల్లాసం కల్గించడమే కాకుండా యువకుల మధ్య ఐక్యమత్యానికి స్నేహాభావానికి దోహదం చేస్తాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి,మాజీ సర్పంచ్, డాక్టర్ రాజు నాయక్,లు అన్నారు.ఆదివారం యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో మాజీ సర్పంచ్,డాక్టర్ రాజు నాయక్ తల్లి రూప్లి భాయి జ్ఞాపకార్థంగా ఏర్పాటుచేసిన ఎన్ పిఎల్ సీజన్ 4 క్రికెట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి హాజరైనారు.అనంతరం డాక్టర్ వర్త్యావత్ రాజు నాయక్ తో కలిసి క్రీడోత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత కోసం తన తల్లి పేరు మీద డాక్టర్ రాజనాయక్ క్రీడలు నిర్వహించడం గొప్ప విషయం అని కొనియాడారు. అంతేకాకుండా నేటితరం విద్యార్థులు, యువతరం టెక్నాలజీ వైపు దూసుకెళ్తున్న ఈ తరుణంలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందడంతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతాయన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శరీరానికి సరైన వ్యాయామం లేకపోతే రోగాల బారినపడే అవకాశం ఉంటుందన్నారు.ఒకే చోట కూర్చొని కంప్యూటర్ ఉద్యోగం చేసే వారు తప్పనిసరిగా ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామం లేదా క్రీడలకు కేటాయించాలని సూచించారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగపరుచుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్,పిఎస్సిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి,ఇబ్రహీంపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్ కుమార్,జెర్కొని రాజు,రాజేష్ గౌడ్,గ్రామ శాఖ అధ్యక్షులు కొండాపురం శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి యంజాల చంద్రకాంత్,మాజీ వార్డు సభ్యులు గౌర శేఖర్,బీఆర్ఎస్ వినాయకులు మొహమ్మద్ ఖాజు,వర్త్యావత్ గణేష్, క్రీడాకారులను గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలి







**సింగరేణి ఏరియా జిఎం .దేవేందర్**

**మందమర్రి,ఫిబ్రవరి 23 (సూర్యరేఖ)**ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని, తద్వారా ఒత్తిడి లేని శారీరక మానసిక ఆరోగ్యంతో జీవించవచ్చునని మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ జి. దేవేందర్ అన్నారు.ఆదివారం డ్రీమ్ యోగ అండ్ ఫిట్ నెస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు జిఎం. దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వాలన గావించి,అనంతరం అఖండ జ్యోతి వెలిగించి అతిథులు, నిర్వాహకులు, పోటీదారులతో కలిసి కాగడాతో రన్ నిర్వహించారు.ఈ సందర్భంగా జీఎం దేవేందర్ మాట్లాడుతూ... ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవన తరుణంలో మానసిక ఒత్తిడి పెరుగుతుందని, యోగాతో మనసును కట్టడి చేసినట్లయితే ఉపశమనం పొంది మంచి మార్గం వైపు పయనించవచ్చని అన్నారు.యోగాతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకునేందుకు ఏకాగ్రత ఆరోగ్యం లభిస్తుందని,పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.విద్యార్థులకు యోగా శిక్షణ కోసం అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి సింగరేణి సంస్థ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరి జీవితంలో యోగ నిత్యకృత్యం కావాలని అన్నారు.ఇట్టి పోటీల్లో రాష్ట్రంలోని 30 జిల్లాల నుండి విచ్చేసిన యోగా సాధకులు,8 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల పైబడిన వారు పోటీల్లో పాల్గొన్న వారిని 14 విభాగాలుగా విభజించి హైదరాబాదు నుండి విచ్చేసిన అపార యోగా నిష్ణాతులైన న్యాయ నిర్ణేతల సమక్షంలో పోటీలను నిర్వహించారు. భారతీయ సంస్కృతిలో విశేషమైన ప్రాధాన్యం ఉన్నటువంటి 12 శక్తి వంతమైన యోగ భంగిమలతో సమ్మిళితమైన సూర్య నమస్కారాలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల అంజనిపుత్ర రియల్ ఎస్టేట్స్ సహాయ సహకారాలు అందించారు.ఈ కార్యక్రమంలో డ్రీమ్ యోగా అండ్ ఫిట్ నెస్ సెంటర్ ఫౌండర్ టోర్నమెంట్ నిర్వాహకులు ముల్కల్ల శంకర్, ఆల్ ఇండియా యోగ ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిడ్జ్ భూషణ్ పురోహిత్, తెలంగాణ యోగ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. రవికుమార్,యోగా థెరపిస్ట్ సత్యరెడ్డి,ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి కనపర్తి రమేష్, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, యోగ మాస్టర్లు,బర్ల సదానందం,కొంపెల్లి రమేష్,బడికల సంపత్,మద్ది శంకర్,లయోల కుమార్,ఎగ్గేటి రాజేశ్వరరావు,పోలు సంపత్,ఎగ్గేటి రాజమౌళి,డిఎస్ రావు, ముల్కల్ల సాయి,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం





**రాజేంద్రనగర్,ఫిబ్రవరి 23** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురంలో శ్రీ కేదారేశ్వర శివాలయంలో అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు.పెద్ద ఎత్తున హాజరైన భక్తుల మధ్య శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది.రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనడంతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పండితులు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని ఆశీర్వదించారు. అనంతరం తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...శివరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన శివపార్వతుల కల్యాణ కార్యక్రమంలో తనని ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.దైవ కార్యాలకు పెద్దపీట వేస్తూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ శివపార్వతుల ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ముఖ్య నాయకులు లిక్కి వెంకటేశ్వర్ రెడ్డి, సీతారాం మహిపాల్, రాపోలు భూపతిరెడ్డి, తలారి చిన్న, బుగ్గయ్య, గురుస్వామి రమేష్, అవినాష్,శంకర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి స్థానిక యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మైలర్ దేవ్ పల్లిలో విశేషంగా హనుమాన్ చాలీసా సంకీర్తన..



**రాజేంద్రనగర్,ఫిబ్రవరి 23** రాజేంద్రనగర్ సర్కిల్‌లోని మైలర్ దేవ్ పల్లి డివిజన్‌లో సేవా భారతీ ఆధ్వర్యంలో భక్తి భావంతో విశేషంగా హనుమాన్ చాలీసా సంకీర్తన జరిగింది. పద్మశాలిపురం శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భక్తుల మధుర స్వరాలలో హనుమాన్ చాలీసా పఠనం ఆలయ పరిసరాలను గానామయంగా మారుస్తూ,భక్తి పరవశాన్ని పెంచింది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను పెంచుతూ, సాంస్కృతిక మూలాలను గుర్తు చేసే ప్రయత్నం జరిగింది.హనుమాన్ చాలీసా చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుపుతూ ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుంది.మనసు ప్రశాంతంగా మారుతుంది.ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.ప్రాబ్లమ్స్ ను ఎదుర్కోవడానికి కావాల్సిన శక్తినిస్తుంది.శరీరంలో నాడులు యాక్టివేటై వ్యాధులు తగ్గుతాయని పండితులు చెబుతున్నారు.ఈ కార్యక్రమంలో పరివేక్షక్ స్వప్న నిర్వాహక్ లక్ష్మి,హేమలత పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి యువకుడి మృతి..



**మందమర్రి,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ వంతెనపై బైక్ అదుపు తప్పి ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా,మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.పట్టణ ఎస్సై శివనీతి రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన యువకుడు షేక్ జిలానీ తన సోదరుడు షేక్ ముగ్ధుం తో కలిసి పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్ళి తిరిగి బెల్లంపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా పట్టణంలోని పాత బస్టాండ్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ వంతెనపై అతివేగంగా,అజాగ్రత్తగా నడపడంతో బైక్ అదుపు తప్పి డివైడర్ ను ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న షేక్ జిలానీ (30) అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడు కేకే ఓసిపిలో లారీ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నారు. వెనుకాల కూర్చున్న మృతుని సోదరుడు షేక్ మగ్దూం తీవ్రంగా గాయపడగా అతన్ని బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## డిఆర్ సిలో పదకొండు మున్సిపాలిటీలకు ఒకే రోజు నైపుణ్య శిక్షణ కార్యక్రమం..

**కమిషనర్ అమరేందర్ రెడ్డి**



**తుర్కయంజాల్,ఫిబ్రవరి 23 (సూర్యరేఖ)** పురపాలక సంఘం పరిధిలోని బ్రాహ్మణపల్లి డిఆర్ సి లో 11 మున్సిపాలిటీలకు ఆదివారం కంపోస్టింగ్, ఘనవ్యర్థాల నిర్వహణపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్టు పుర కమిషనర్ అమరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సిడిఎంఎ ఆదేశాల మేరకు,పురపాలక జాయింట్ డైరెక్టర్ సంధ్య,సిడిఓ హేమలత పర్యవేక్షణలో 11 పురపాలక సంఘాల కమిషనర్లకు,పారిశుద్ధ్య ఇన్స్పెక్టర్లకు,పర్యావరణ ఇంజనీర్లు,వార్డు అధికారులకు శిక్షణను ఇచ్చారు.ఆధునిక పద్ధతులలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్యంలో అనుసరించాల్సిన పద్ధతులు,తడి, పొడి,హానికర చెత్తలను వేరు చేసే విధానం,చెత్తతో సంపదను సృష్టించడం తక్కువ ఖర్చుతో చెత్తను ప్రాసెసింగ్ చేయు విధానం,తడి చెత్తతో సంపదను సృష్టించే లాభాలు,ఘనవ్యర్థాల నిర్వహణలోని కొత్త పద్ధతులు,వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు జాయింట్ డైరెక్టర్ సంధ్య పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంపై అన్ని పురపాలక సంఘాల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షన్ కో ఆర్డినేటర్ ఫణి,జోగిపేట్ పీర్జాదిగూడ, నిజాంపేట్ ,నాగారం,మీర్పేట్,జవహర్ నగర్, గుండ్లపోచంపల్లి,దమ్మాయిగూడా,బొల్లారం ఆదిభట్ల, బడంపేట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## జిమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,ఫిబ్రవరి 23 (సూర్యరేఖ)** ఉప్పల్ భాగాయత్ లో (తురబోజిమ్ ) ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి హాజరై జిమ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు ఉప్పల్ భాగాయత్ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ఫిట్నెస్ అభివృద్ధికి ఇలాంటి సదుపాయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిమ్ యాజమాన్యం విశాల్,సత్యం, శ్రీనివాస్ రెడ్డి ,ఈగ సంతోష్ ముదిరాజ్,విప్లవ్ రెడ్డి,యది రెడ్డి స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శారదా ధామము 41వ వార్షికోత్సవములో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ మాననీయ జిష్ణుదేవ్ వర్మ







**గండిపేట్,ఫిబ్రవరి 23** బండ్లగూడ జాగిర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయ ము,శ్రీ శారదా ధామము 41వ వార్షికోత్సవమునకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొని మార్గదర్శనం చేశారు.శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయము, శ్రీ శారదా ధామము ప్రవేశించిన వెంటనే ఓ చక్కటి అనుభూతికి లోనుకావడం చదువుల తల్లి శారదా మాత దర్శనము ఒక చక్కటి వాతావరణములో ఆకట్టుకుందని గవర్నర్ అన్నారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ. దేశానికి సమాజానికి అవసరమైన భవిష్యత్ యువతరం శ్రీ సరస్వతీ శిశు మందిరముల ద్వారానే నిర్మాణము అవుతుందని,సరస్వతి శిశుమందిరాల ద్వారా దేశ సమాజ నిర్మాణానికి పునాది అవుతుందని పేర్కొన్నారు. చక్కటి కుటుంబ వ్యవస్థ సంస్కృతి సంప్రదాయంతో కూడిన విద్య శిశుమందిరాలలో దొరుకుతుందని ఆయన చెప్పారు. ఎక్కడైతే చక్కటి వాతావరణము ఉంటుందో అక్కడ నుంచే దేశ భవిష్యత్ నిర్మాణము అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అధ్యక్షులు విశ్రాంత ఉస్మానియా విశ్వ విద్యాలయ మాజీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ డాక్టర్ తక్కెళ్లపల్లి తిరుపతి రావు, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి విరివింటి రవీంద్ర శర్మ, ఆవాస విద్యాలయము కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్,అధ్యక్షులు అర్జున్ గౌడ్,శ్రీ సరస్వతీ విద్యా పీఠము ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస రావు,పోషకులు పాల్గొన్నారు.బాల బాలికల ఘోష్ ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది.

# గ్రాడ్యుయేషన్ దినోత్సవ వేడుకలు








**రాజేంద్రనగర్,ఫిబ్రవరి 23** విద్యారంగంలో గత 12 సంవత్సరాలుగా శ్రీ గాయత్రి ఇ- టెక్నో పాఠశాల అందిస్తున్న సేవలు అభినందనీయమని వేడుకకు విచ్చేసిన ప్రముఖులు ప్రశంసించారు.ఈ పన్నెండు సంవత్సరాల కాలంలో విద్యార్థులను మణులుగా తీర్చి దిద్దగలిగారని కొనియాడారు. గాయత్రి పాఠశాలలో చదివిన విద్యార్థులు సమాజంలో మంచి మార్పులకై పాటు పడాలని దీవిస్తూ,ఈ ప్రయాణం ఇలాగే ముందుకు సాగాలని ఆకాంక్షించారు.శ్రీ గాయత్రి ఇ-టెక్నో పాఠశాలలో గ్రాడ్యుయేషన్ దినోత్సవాలు కాటే దాన్లోని అమ్మ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవాలకు స్థానిక రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిధిగా విచ్చేయగా విద్యార్థులను ఉద్దేశించి శ్రీ గాయత్రి పాఠశాల చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలలో ఉన్నారని అభినందించారు.క్రమశిక్షణకు పెద్ద పేద వేస్తున్నారని కొనియాడుతూ రాబోయే రోజులలో ఈ విద్యా సంస్థ నుండి విద్యార్థులు ఇంజనీర్లు.లాయర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. అకాడమిక్ కో-ఆర్డినేటర్ నిరంజన్ శాస్త్రి గారు మాట్లాడుతూ..విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు కలిగి విద్యను అభ్యసం - చాలని, చురుకుగా అన్ని రంగాలలో ఎదగాలని కోరుకున్నారు.ఈ ఉత్సవాలలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు చేసిన నృత్య ప్రదర్శన, విద్యార్థినీలు ప్రదర్శించిన సాంస్కృతిక వృత్యం,విద్యార్థులు ప్రదర్శించిన హనుమంతుని వృత్య ప్రదర్శనతో పాటు 5 సంవత్సరాల చదువుతున్న ఆరాధ్య తడబాటు లేకుండా తక్కువ సమయంలోనే హనుమాన్ చాలీసా పూర్తి చేయడం, ప్రముఖులతో పాటు, అందరిని ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, పాఠశాల చెర్మెన్.కె మధుసూదన్ డైరెక్టర్లు సమయుద్దీన్, శ్రీహరి,సిఈఓ సర్వేశ్వర రావు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ నిరంజన్ శాస్త్రితో పాటు పలువురు హజరై విద్యార్థులను అభినందించి, ఆశీర్వదించి విజయవంతంగా పూర్తి చేశారు.

# శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి వేడుకలు





**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**తుర్కయంజాల్,ఫిబ్రవరి23(సూర్యరేఖ)** మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్,ఇంద్రమ్మ కాలనీ,బంజారా హెల్పర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సేవాలాల్ మహారాజ్ పూజలు నాయకులతో కలిసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజన సమాజాన్ని ఐక్యం చేసినా మహోన్నత పురుషుడు అని,ప్రతి గిరిజనుడు ఆయన చూపించిన మార్గాన్ని అనుసరించి బంజారా సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని వారు అన్నారు. అదేవిధంగా సేవాలాల్ మహారాజ్ గుడి కన్స్ట్రక్షన్ ప్లాన్ వెంటనే ఇస్తే నెల రోజులలోనే ఈ గుడి అభివృద్ధి చేస్తానని ఆయన బంజారాలకు మాట ఇచ్చారు.రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి మాట్లాడుతూ...బంజరాలకు ఎలాంటి సమస్యలు ఉన్న వాళ్ళ వెంట ఉండి వాళ్ల సమస్యలు తీరుస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు కాకుమాను సునీల్, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్,తుర్కయంజాల్ మాజీ కౌన్సిలర్లు రామావత్ కళ్యాణ్ నాయక్,కోసికే ఐలయ్య, రవీందర్ రెడ్డి, గౌతంరెడ్డి, బొక్క వంశిధర్ రెడ్డి,,నాయకులు మంగళనాయక్,శ్రీనివాస్ నాయక్, రమేష్ నాయక్,నేనావత్ బిక్కన్ నాయక్,నేనావత్ భాస్కర్ నాయక్, రాజునాయక్, దశరథ్ నాయక్,దస్రు నాయక్,పాండునాయక్, బంజారా పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టెస్కాబ్ వైస్ చైర్మన్ డీసీసీబీ చేర్మెన్ కొత్తకుర్మ సత్తయ్యని మర్యాదపూర్వకంగా కలిసిన వింటేజ్ హెూమ్స్ కాలనీ ప్రతినిధులు..



**తుర్కయంజాల్,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** డీసీసీబీ సహకార సంఘాల పదవీకాలాన్ని 6 నెలలు పొడిగించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్,డీసీసీబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యని తన నివాసంలో వింటేజ్ హెూమ్స్ కాలనీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం శాలువాతో సత్కరించి శుభా కాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్,కాలనీ సభ్యులు నర్సింహా రెడ్డి,అశోక్,బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గురుకుల ప్రవేశ పరీక్ష..



**రామాయంపేట,ఫిబ్రవరి 23,(సూర్యరేఖ)** రామాయంపేట పట్టణ కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం పరీక్ష రాసే ఐదవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉదయం పరీక్ష సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రానికి హాల్టికెట్ ఆధార్ కార్డుతో తల్లిదండ్రులతో విద్యార్థులు చేరుకున్నారు.వారి వద్ద ఉపాధ్యాయులు హాల్ టికెట్లు పరిశీలించిన అనంతరం కేంద్రానికి అనుమతించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం ఒంటిగంట వరకు ముగిసింది. ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 478 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా అందులో 465 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.మరి అందులో 13 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు తెలిపారు.మొత్తం మీద గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష పకడ్బందీగా ప్రశాంతంగా జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు.

## జైదా హాసన్ నూతన మజీద్ భక్తి శ్రద్ధలతో ప్రారంభించిన మైనార్టీ పెద్దలు యువకులు







**అందోల్,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** రాయికోడ్ మండలం చీమ్నపూర్ లోని రాయికోడ్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన జైదా హాసన్ మజీద్ ప్రారంభోత్సవనికి రాయికోడ్ మండలం అన్ని గ్రామాల పెద్దలు,మైనార్టీ పెద్దలు కులమతాలకు అతీతంగా మసీదును ప్రారంభించారు.ప్రత్యేక ప్రార్థనలతో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన ప్రతి ఒక్కరూ మొక్కలు చెల్లించుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అందరు మైనార్టీ సోదరులు ఐక్యమత్యంతో కలిసిమెలిసి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి భారీగా కులమతాలకతీతంగా హాజరై భక్తి శ్రద్ధలతో ముక్కులు చెల్లించుకుని ఆ అల్లా దయతో తెలంగాణ రాష్ట్రంలోని పాడిపంటలు బాగా పండి పిల్ల పాపను చల్లగా చూడాలని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మైనార్టీ పెద్దలు,యువకులు, కులమతాలకతీతంగా చాలామంది పెద్దలు హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి మక్షుద్ మియా పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## బతికిన బతుకమ్మ కుంట

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చెరువులు కుంటల సంరక్షణ పునరుద్ధరణలో.. హైడ్రా మరో విజయం సాధించింది. బఫర్ జోన్లలో నాళాలపైన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు చెరువులను పునరుద్ధరించే పనులు నిర్వహిస్తున్న హైడ్రా.. అంబర్ పేట్ బతుకమ్మ కుంటలో తవ్వకాలు చేపట్టింది. మోకాల లోతు తవ్వగానే బతుకమ్మ కుంటలో నీళ్లు వచ్చాయి. దీంతో బతుకమ్మకుంట బ్రతికే ఉందంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.రేవంత్ సర్కారు ఏర్పాటు చేసిన హైడ్రా పుణ్యమా అంటూ అంబర్ పేట్లోని బతుకమ్మకుంట బయటపడింది. కబ్జా చెర వీడడంతో దీని అభివృద్ధి పైన హైడ్రా దృష్టి పెట్టింది. ఇళ్లను కూల్చకుండా కుంటపైనే దృష్టిపెట్టింది. ఆ తర్వాత చెత్త, మొక్కల్ని తొలగించిన అధికారులు తాజాగా చెరువులో పూడిక తీయడం స్టార్ట్ చేశారు. బుధవారం జేసీబీలు కేవలం అడుగున్నర తవ్వగా లోపల నుంచి వాటర్ ఉబికి వచ్చాయి. ఈ దృశ్యాన్ని చూస్తున్న స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ.. కుంట అభివృద్ధిలో తమ వంతు సహకారాన్ని అందించడానికి ముందుకు వచ్చారుబడాబాబుల కబ్జాలకు గురై కుంట ఎండిపోయి జీవం పోయిందనుకున్న బతుకమ్మ కుంట బ్రతికే ఉందని తెలిసి స్థానికులు చేరుకుంటున్నారు. ఆ కుంటలో మోకాళ్ల లోతు మట్టి తీయగానే బిరబిర గంగమ్మ బయటకు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇటీవల కొందరు ఇది బతుకమ్మకుంట కాదు.. మా స్థలమని నమ్మబలికిన వారు ఇప్పుడేమంటారు అక్కడి స్థానికులు ప్రశ్నిస్తున్నారు.కాగా హైదరాబాద్ను మహా నగరంగా తీర్చిదిద్దేందుకు హైడ్రా చర్యలు చేపడుతుంది.

సూర్య



# హైడ్రాకు మరిన్ని పవర్ పోలీస్ స్టేషన్



**హైదరాబాద్ :** హైడ్రా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హైడ్రా పేరు వింటేనే అక్రమదారులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే హైడ్రాకు ప్రభుత్వం రోజురోజుకీ మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఆర్థికంగా ప్రభుత్వం ఫుల్ సపోర్టు చేస్తోంది. గతంలో హైడ్రాకు పోలీస్ స్టేషన్ కూడా అందుబాటులోకి రానుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పోలీస్ స్టేషన్ ఏర్పాటు అయ్యాక హైడ్రాకు మరింత బలం చేకూరనుంది. మార్చి మొదటి వారంలో హైడ్రా పోలీస్ స్టేషన్ అందుబాటు లోకి రానుంది. ఇప్పటికే హైడ్రా పోలీస్ స్టేషన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పోలీస్ స్టేషన్ కు సంబంధించిన అన్ని రకాల పనులు ఫిబ్రవరి చివరి వారంలోగా పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీస్ స్టేషన్ లో కావాల్సిన సిబ్బంది గురించి కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. కావాల్సిన సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హైడ్రాకు ఒక పోలీస్ స్టేషనే కాక వెబ్ సైట్, మొబైల్ యాప్ కూడా అందుబాటులోకి రానున్నాయి. హైడ్రాకు సంబంధించిన వెబ్ సైట్ , మొబైల్ యాప్ కూడా రూపొందించేందుకు ఇప్పటికే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. మొబైల్ యాప్ లో చెరువులు, కుంటలు, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ల వివరాలను తెలియజేయనున్నారు. దీంతో భాగ్యనగర వాసులకు ఎలాంటి స్థలం కొనాలో ఈజీగా తెలుసుకోవచ్చు. ఎక్కడ ల్యాండ్ కొనకూడదో తెలుసుకోవచ్చు. హైడ్రా పోలీస్ స్టేషన్, వెబ్ సైట్, యాప్ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించారు. మార్చి ఫస్ట్ వీక్ లో ఈ మూడు అందుబాటులోకి రానున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. హైడ్రా ప్రధాన కార్యాలయానికి పైగా ప్యాలెస్ ను కేటాయించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ భవంతికి సంబంధించిన మరమ్మతులను హెచ్ఎండీఏ చేపడుతోంది. పైగా ప్యాలెస్ భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నిల్ కూడా ఇచ్చింది. అయితే, ఈ మరమ్మతుల పనులు అన్నీ పూర్తి కావడానికి సంవత్సర కాలం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అలాగే రీజనల్ అఫీసులను కూడా ఏర్పాటు చేయనున్నారు. భాగ్యనగరానికి సంబంధించిన రీజినల్ కార్యాలయాన్ని బుద్ధ భవన్ లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాచకొండకు సంబంధించిన రీజినల్ కార్యాలయాన్ని తార్నాకలోని పాత హెచ్ఎండీఏ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. సైబరాబాద్ కు సంబంధించిన రీజనల్ కార్యాలయాన్ని నానక్ రాం గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(ఊఉఅఒ)లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే వీటి పనులు ప్రారంభమయ్యాయి.

**ఈ విధంగా రీజనల్ కార్యాలయాలు:**

హైదరాబాద్ బుద్ధభవన్

రాచకొండ- తార్నాక ఓల్డ్ హెచ్ఎండీఏ ఆఫీస్

సైబరాబాద్ నానాక్ రాం గూడ (హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్)

# మళ్లా తెలంగాణ సెంటిమెంట్



**హైదరాబాద్ :** రాజకీయాల్లో నేతల ప్రతీ మాటకు ఓ లెక్క ఉంటుంది. కొద్ది మంది తమ మాటల ద్వారా ప్రజల్ని తమ వైపు తిప్పుకుంటారు. మరి కొద్ది మంది నేతలు తమ మాటల ద్వారా ప్రత్యర్థి నేతలను, పార్టీలను ఢిఫెన్స్‌లోకి నెడతారు. మరి కొద్ది మంది నేతలు మాట జారి వివాదస్పదమై సెల్ఫ్ డిఫెన్స్‌లోకి జారుకుంటారు. అలాంటి వ్యాఖ్యలతో పార్టీకి, ప్రజలకు ఓ సంకేతాన్ని పంపుతారు ఇంకొందరు. ఇదంతా ఎందుకంటే రాజకీయ నేతలకు ప్రధాన ఆయుధం వారి మాటలే. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు చర్చాంశనీయమయ్యాయి. ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణ లో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు అని కేసీఆర్ వాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కాకతాళీయంగా చేసినవి కాదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. చాలా ఆచితూచి ప్రయోగించిన పాత అస్త్రంగా కేసీఆర్ రాజకీయాలన్ని దగ్గరి నుంచి చూస్తోన్న విశ్లేషకులు చెబుతున్నారు. విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ చంద్రబాబు పాలన నాటి రోజులను గుర్తు చేశారు. కరెంటు కోతలు, కరెంటు ఛార్జీల పెంపు, ఉద్యమం నాటి పరిస్థితులను చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే తాను తెలంగాణ ఉద్యమాన్ని ఎత్తుకోవాల్సి వచ్చింది, కనీసం తన పార్టీకి కార్యాలయం దొరకనీయకుండా చంద్రబాబు చేశారని గుర్తు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జల దృశ్యంలో తన ఇంటినే కార్యాలయంగా ఇస్తే దాన్ని చంద్రబాబు కూల్చివేశారని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యల ద్వారా తెలంగాణ ప్రాంతానికి చంద్రబాబు ప్రధాన శత్రువు అని చెప్పే ప్రయత్నం చేశారు కేసీఆర్. చంద్రబాబు అడుగుపెడితే అవే పరిస్థితులు పునరావృతం అవుతాయని హెచ్చరికను పార్టీ శ్రేణులకు, ప్రజలకు పంపే ప్రయత్నం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లోను కేసీఆర్ ప్రధాన ప్రచారాస్త్రం చంద్రబాబే. తెలంగాణను అడ్డుకున్న వ్యక్తిగా చంద్రబాబును ఆ ఎన్నికల్లో కేసీఆర్ చిత్రీకరించారు. తెలంగాణను అడ్డుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించిన చంద్రబాబు తిరిగి తెలంగాణ రాజకీయాల్లోకి ఎలా రానిద్దామంటూ ప్రతీ సభలో కేసీఆర్ ప్రజలను ప్రశ్నించారు. ఈ ప్రచారం ప్రజల్లోనీ తీవ్ర చర్చ రెకెత్తించింది. కేసీఆర్ ఎత్తుగడ ఫలించింది. ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ మెజార్టీ స్థానాలు గెల్చుకోని అధికారంలోకి వచ్చింది. 2018లో కూడా చంద్రబాబును టార్గెట్ చేస్తూ ప్రచారం చేశారు. ఆయన టార్గెట్‌గానే కేసీఆర్ ప్రతి సభలో విమర్శలు చేశారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని తెలంగాణపై పెత్తనం చేయడానికి వస్తున్నారని తీవ్ర స్థాయిలో సెంటిమెంట్ రగిల్చారు. అప్పుడు కూడా చంద్రాస్త్రంతోనే కేసీఆర్ పవర్‌లోకి వచ్చారు. అధికారం కోల్పోయి ఏడాదిన్నర అవుతున్న టైంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం వేదికగా కేసీఆర్ చంద్రబాబు అస్త్రాన్ని బయటకు తీశారు. తిరిగి ఎన్డీఏ పేరుతో చంద్రబాబు తెలంగాణలో రాజకీయాలు చేయనున్నారని ఇది తెలంగాణ ప్రాంతానికి నష్టం చేస్తోందని చెప్పేందుకు కేసీఆర్ విమర్శలు చేశారు. ఓవైపు చంద్రబాబు ఏపీ సీఎంగా ఉంటూ, తెలంగాణలో రాజకీయాల్లో కూడా అడుగుపెడితే తెలంగాణాకు అన్యాయం, ఏపీకి లాభం జరుగుతుందన్న లాజిక్‌ను వాడే ప్రయత్నం చేస్తున్నారు కేసీఆర్. ఎన్డీఏలో చక్రం తిప్పే పరిస్థితుల్లో ఉన్న చంద్రబాబు, తెలంగాణలోకి రానిస్తే కేంద్రం నుంచి వచ్చేవి రాకుండా అడ్డుపడే అవకాశం ఉంటుందని, గోదావరి, కృష్ణా జలాలను తరలించుకునే అవకాశం ఉందని అందుకే కేసీఆర్ ఈ వాఖ్యలు చేసినట్లు గులాబీ ముఖ్య నేతలు చెబుతున్నారు. చంద్రబాబు శిష్యుడైన రేవంత్ రెడ్డి ఇక్కడ సీఎంగా ఉండటంతో చంద్రబాబుకు అడ్డు లేకుండా పోతుందని అందుకే కేసీఆర్ ముందు చూపుతో చేసిన వ్యాఖ్యలగా బీఆర్ఎస్ నేతలు విశ్లేషిస్తున్నారు. ఎన్డీఏ పేరుతో తెలంగాణలోకి చంద్రబాబు రాకుండా చేసే ప్రచారం కేసీఆర్ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రచారంతో తెలంగాణ ప్రజల్లో మరోసారి సెంటిమెంట్ రేకేత్తించవచ్చున్నది ఆయన వ్యూహంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2014, 2018లో మెజార్టీ స్థానాలు బీఆర్ఎస్ గెలవడానికి కారణం తెలంగాణలో చంద్రబాబు ప్రచారం చేయడమే అన్న విశ్లేషణలు ఉన్నాయి. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు తెలంగాణలో తిరిగితే అది కేసీఆర్‌కు ప్లస్ అవుతుందని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. ఇదే జరిగితే మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అది కేసీఆర్‌కు సెంటిమెంట్ అస్త్రంగా మారనుందని అంటున్నారు. ఇదే వ్యూహంతో కేసీఆర్ చాలా ఆలోచించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు.

# ఎల్ఆర్ఎస్‌పై రూల్స్ కండిషన్స్ అప్లై




**హైదరాబాద్ :** ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ) దరఖాస్తులను పరిష్కరించే దిశగా తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్కీమ్ అమలులో వేగం పెంచేందుకు 25 శాతం రాయితీని ప్రకటించింది. 2020లో తీసుకువచ్చిన రూల్స్ కి కొన్ని సవరణలు చేసింది. అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవలనే కీలక నిర్ణయం తీసుకోగా.. తాజాగా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీ చేసింది. క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వనుంది. అయితే మార్చి 31లోగా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును చెల్లించిన వారికి మాత్రమే ఈ రాయితీ నిర్ణయం వరిస్తుంది. ఇదే విషయాన్ని ఉత్తర్వుల్లో కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ఉన్న నిబంధనల్లో పలు మార్పులు తీసుకువచ్చింది. స్కీమ్ లో తీసుకువచ్చిన తాజా మార్పులతో చాలా మంది భూయాజమానులు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగానే ఆదాయం రానుంది. అయితే ఈ స్కీమ్ లో తాజాగా తీసుకువచ్చిన మార్పులు, కటాఫ్ తేదీ వివరాలకు సంబంధించిన ముఖ్యమైన విషయాలు ఇక్కడ చూడండి?.

**ఎల్ఆర్ఎఎస్ స్కీమ్ - 10 ముఖ్యమైన అంశాలు:**

ఎల్ఆర్ఎస్ స్కీమ్ 2020 ఏడాదిలో తీసుకొచ్చారు. ఇందుకోసం గ్రామాలు, పట్టణాల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ స్కీమ్ లో భాగంగా?అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. దరఖాస్తు ఫీజు కింద రూ. 1000 నిర్ణయించారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ప్రభుత్వానికి 25.67 లక్షల దరఖాస్తులు అందాయి. ఇందులో ప్లాట్లకు సంబంధించినవి 25.53 లక్షల దరఖాస్తులు కాగా, లేఅవుట్ల దరఖాస్తులు 0.13 లక్షలుగా ఉన్నాయి. ఇవన్నీ కూడా పెండింగ్ లో ఉన్నాయి.

ఎల్ఆర్ఎస్ స్కీమ్ విషయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. దీంతో నాటి ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయింది. దీంతో అప్పట్నుంచి? నేటి వరకు కూడా ఈ దరఖాస్తుల విషయం పెండింగ్ లోనే ఉండిపోయింది. దరఖాస్తుదారులంతా క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం?. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా ప్రత్యేక డెస్క్ లను ఏర్పాటు చేసి? పరిష్కారం చేసే దిశగా ప్రయత్నాలు చేసింది. అయితే అనుకున్న స్థాయిలో స్పందన రాలేదు.

ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 10 శాతం ప్లాట్లు రిజిస్టరైన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. మార్చి 31 లోపు క్రమబద్ధీకరణ ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తామని మంత్రుల బృందం ప్రకటిచింది.

మంత్రుల బృందం ప్రకటన తర్వాత తాజాగా ఇందుకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 'తెలంగాణ రెగ్యూలరైజేషన్ ఆఫ్ అన్అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్ 2020కి సవరణలు చేస్తూ జీవో నెంబర్ 28ని విడుదల చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు.

ఈ జీవో వివరాల ప్రకారం? లే ఔట్ల క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది.

తాజా సవరణల ప్రకారం ఒఖీూ కటాఫ్ తేదీ (26.08.2020) నాటికి లేఔట్లలో కనీసమైనా 10 శాతం ప్లాట్లు విక్రయించి ఉండాలి. దీంతో మిగతా విక్రయించని ప్లాట్లను ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు ఉంటుంది.

ఈ లేఔట్లలో భూమిని కొనుగోలు చేసినవారు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కు వెళ్లి వివరాలను సమర్పించవచ్చు. వీటిని ఎల్ఆర్ఎస్ పోర్టల్ కు అనుసంధానం చేస్తారు. ఇక్కడ క్రమబద్ధీకరణ చార్జీలతో పాటు ప్రోరేటా ఓపెన్ స్పేస్ చార్జీలు వసూలు చేసి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు.


## నేడు కిస్మత్ పూర్ లో విద్యుత్ సరఫరా నిలిపివేత..



**బండ్లగూడ,ఫిబ్రవరి 23** కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ.మల్లేష్ రాజ్ తెలిపారు.రిసెప్షన్ పరిధిలో డాన్ బోస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మీ చల్ కాలనీ, వినాయక్ నగర్,డీడీకాలనీ,కాళీ మందిర్,ఎన్ఎఫ్ సి కాలనీ,ఆదర్శనగర్,ఎక్సైజ్ అకాడమీ,అభ్యుదయ నగర్, అరుణోదయ నగర్,సంధ్యానగర్,జిఆర్ నగర్, మాచన్పల్లి ఎంక్లేవ్,బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి మూడు గంటల వరకు ఆరే మైసమ్మ ప్రధాన రహదారి, ఖాళీకానగర్,ఎన్ఎఫ్సీ కాలనీ,మల్లికార్జున నగర్, ఆదర్శనగర్ రోడ్ నెంబర్ 1,5,న్యూకేర్ హాస్పిటల్, గాయత్రి నగర్,వికాస్ నగర్,ద్వారకానగర్,యాదవ మిత్రకాలనీ,షిరిడి సాయిబాబాకాలనీ,ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్,భారతి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా జర్నలిస్ట్ పగిడిమర్రి సూర్యనారాయణ 25 వ వివాహా వార్షికోత్సవం..

**హాజరైనా జర్నలిస్టులు,స్నేహితులు,బంధువులు**



**రాజేంద్రనగర్,ఫిబ్రవరి 23**రాజేంద్రనగర్ మండల జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి పగిడిమర్రి సూర్యనారాయణ - ఉమాదేవి దంపతుల 25 వ వివాహ వార్షికోత్సవం ఆదివారం మార్కండేయనగర్ లోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టులు,కుటుంబ సభ్యులు,స్నేహితులు,బంధువులు ఈ వేడుకలలో పాల్గొని పగిడిమర్రి సూర్యనారాయణ - ఉమాదేవి దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఆయనతో కేక్ కట్ చేయించారు.ఇరువురు కలకాలం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో,సిరి సంపదలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని తెలిపారు. సూర్యనారాయణ - ఉమాదేవి,ల పిల్లలు పి.సౌమ్య,పి.ప్రవీణ్ లు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.వివాహ వార్షికోత్సవ వేడుకల్లో సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్,శివకుమార్,రాజేంద్రనగర్ మండల జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు మేకల దామోదర్ రెడ్డి,జర్నలిస్ట్ సంఘం నాయకులు ఎ.భీమయ్య,ఎం.ప్రేమ్ రాజ్,పి.సూర్య కిరణ్,ఎం.బాల సుబ్రమణ్యం,పద్మారం వెంకటేష్,చంద్రకాంత్, బి.బాబురావు,వర్కాల చందు,గద్దె యాదగిరి,కోరని మహేష్ లతోపాటు నాయకులు ఎస్.వెంకటేష్ కురుమ, మసున వెంకటేష్,ఎర్వ సత్యనారాయణ,యు.నిరంజన్,బొల్ల శ్రీనివాస్,అడ్వకేట్ సత్యనా రాయణ,బొల్ల నరేందర్, మునగపాటి చంద్రయ్య,మునగపాటి వెంకటేష్, వెంకటేష్,వివేక్ పాల్గొన్నారు.

## సిఎస్ఆర్ ఫండ్స్ తో పార్కుల అభివృద్ధి.. పార్క్ అభివృద్ధికి కృషి చేసిన ఎల్.వి.రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,ఫిబ్రవరి 23(సూర్యరేఖ)** సిఎస్ ఆర్ ఫండ్స్ తో పార్క్ల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతోందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఆదివారం హబ్సి గూడ వీర రాజ రెడ్డి పార్క్ లో చిల్డ్రన్ పార్క్ లో మరిన్ని సదుపాయాలు ఆట వస్తులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ...ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ కార్పొరేటర్ చేతన హరీష్,ఎల్ వి.రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ ఆర్.వి.శంకర్,అడిషనల్ కమిషనర్ జి హెచ్ ఎంసి.రఘు ప్రసాద్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్,డివిజన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బి.వి.చారి,మాజీ ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి,నాయకులు నవీన్,బీజేపి నాయకులు ఎల్లాచారి,తదితరులు పాల్గొన్నారు.



# త్రిషతోనే కాదు ఆమె కుమార్తెతోనూ సినిమా స్కూల్‌కు వెళ్తా

సినిమా అనే స్కూల్‌కు హీరోయిన్ త్రిషతోనే కాదని, ఆమె కుమార్తెతో కూడా కలిసి వెళ్తానని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ అన్నారు. చెన్నైలో తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో కమల్ హాసన్, త్రిష పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'థగ్‌లైఫ్' మూవీలో కమల్‌తో కలిసి నటించిన అనుభవంపై త్రిష స్పందిస్తూ.. 'థగ్‌లైఫ్' చిత్రంలో నటించడం గొప్ప అనుభవంగా భావిస్తున్నా అన్నారు. కమల్ హాసన్ వద్ద అనేక విషయాలు నేర్చుకున్నానని, ఆయనతో కలిసి ఒక పాఠశాలకు వెళ్ళిన అనుభూతిని పొందానని త్రిష చెప్పారు. ఆ స్కూల్‌లో అనేక విషయాలు తెలుసుకున్నాని తెలిపారు. ఈ సందర్భంగా కమల్ స్పందిస్తూ.. 'నిజమే.. నేను త్రిషతో కలిసి స్కూల్‌కు వెళ్ళాను. అక్కడ అనేక విషయాలు నేర్చుకున్నాం. గురుస్థానం అనేది నాకొద్దు. అది దివంగత కే బాలచందర్‌తోనే ఉండిపోనివ్వండి' అన్నారు. తాను ఎల్లవేళలా ఒక విద్యార్థిగానే ఉండేందుకు ఇష్టపడతానని, త్రిషతో కలిసి స్కూలుకు వెళ్ళా నని కమల్ చెప్పారు. ఆ తరువాత ఆమె కుమార్తెతో కూడా పాఠశాలకు వెళతానని అన్నారు. సినిమా అనేది చాలా పెద్దదని, తాను 5వ తరగతి వరకు మాత్రమే నేర్పించగలనని వ్యాఖ్యానించారు. పీహెచ్‌డీ స్థాయికి నేను నేర్పించలేనని, ఆ స్థాయిలో నేను నేర్చుకోలేదని అన్నారు. సినిమా అనేది అనేక విషయాల సమ్మేళనమని పేర్కొన్నారు.

# 'మజాకా' ట్రైలర్‌లో పీపుల్స్ స్టార్.. తప్పు సరిచేసుకున్న సందీప్

త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో సందీప్ కిషన్ రీతూ వర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'మజాకా'. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం శివరాత్రి కానుకగా ఈ నెల 26న విడుదల కానుంది. అయితే, తాజాగా ఈ చిత్రం నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు. నేను లోకల్,హలో గురు ప్రేమకోసమే,సినిమా చూపిస్త మావ ,ధమాకా వంటి సినిమాలతో దర్శకుడిగా త్రినాథరావుకు మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు ఆయన నుంచి మజాకా మూవీ వస్తుండటంతో ప్రేక్షకులలో మంచి అంచనాలే ఉన్నాయి. తాజాగా విడుదలైన మజాకా ట్రైలర్ టైటిల్ కార్డ్‌లో హీరో సందీప్ కిషన్‌కు 'పీపుల్స్ స్టార్' అనే ట్యాగ్‌లైన్ చేర్చారు. పీపుల్స్ స్టార్ అంటే ఎవరికైనా వెంటనే గుర్తుకొచ్చే పేరు ఆర్. నారాయణమూర్తి అని తెలిసిందే. దీంతో ఈ విషయంపై పలు అభ్యంతరాలు రావడంతో ఆయన వెంటనే స్పందించారు. ఆర్ . నారాయణమూర్తికి పీపుల్స్ స్టార్ ట్యాగ్ లైన్ ఉన్న విషయం తనకు తెలియదని సందీప్ కిషన్ వివరణ ఇచ్చారు. తనకు ట్యాగ్ లైన్స్‌తో ఎలాంటి పనిలేదన్నారు. వాటిని పెద్దగా పట్టించుకోనని తెలిపారు. అయితే, నారాయమూర్తి సినిమాలు చాలా బాగుంటాయని, ఆయనకు తాను కూడా అభిమానినని పేర్కొన్నారు. మజాకా సినిమా కోసం పీపుల్స్ స్టార్ అనే ట్యాగ్ లైన్‌ను తాను పెట్టుకోలేదు. నిర్మాత అనిల్ సుంకర పెట్టారని సందీప్ కిషన్ వివరణ ఇచ్చారు. మజాకా చిత్రంలో సందీప్ కిషన్ - రావు రమేశ్ తండ్రీ తనయుల పాత్రల్లో సందడి చేయనున్నారు. తనయుడు ఒక అమ్మాయితో.. తండ్రి మరో అమ్మాయితో ప్రేమలో పడటం.. సరదాగా సాగే జీవితాల్లో వారికి వచ్చిన సమస్య ఏమిటి? దానిని వారెలా అధిగమించారు? అనే అంశాలతో ఈ సినిమా రూపొందుకున్నట్లు తెలుస్తోంది.






# సమ్మర్ కే జాతకం చెబుతానంటున్న సారంగపాణి

శ్రీదేవి మూవీస్ పతాకంపై సీనియర్ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'సారంగపాణి జాతకం' మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో ప్రియదర్శి రూప కొడవాయూర్ జంటగా నటించారు. ఇప్పటికే ఈ సినిమాను విడుదలైన టైటిల్ సాంగ్ 'సారంగో సారంగా', 'సంచారి సంచారీ' ట్రెండ్ అవుతున్నాయి. అలానే టీజర్ కు మంచి స్పందన లభిస్తోంది. 'జెంటిల్ మన్, సమ్మోహనం' చిత్రాల దర్వాత శ్రీదేవి మూవీస్ బ్యానర్ లో మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కిస్తున్న మూడో చిత్రమిది. ఈ సినిమాను వేసవి కానుకగా విడుదల చేయబోతున్నట్టు మేకర్స్ తాజాగా తెలిపారు. సినిమా చిత్రీకరణ పూర్తయ్యిందని, డబ్బింగ్ తో పాటు ఇతర పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ సైతం తుదిదశకు చేరుకుందని తెలిపారు. మనిషి భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా? చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు ఈ సినిమా జవాబు ఇస్తుందని, ఇంటిల్లిపాదిని కడుపుబ్బా నవ్వించే సన్నివేశాలు ఇందులో ఉంటాయని మోహనకృష్ణ ఇంద్రగంటి తెలిపారు. వివేక్ సాగర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.



### ఆ స్టార్ హీరోతో 20 నిమిషాల సీన్..

# డెబ్యూక్ కెరీర్ మారిపోయింది

యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ లో చిన్న చిన్న సినిమాల్లో కథానాయికగా నటించి మెప్పించింది. ఇండస్ట్రీలోకి వచ్చిన పదేళ్లకు హీరోయిన్ గా సరైన బ్రేక్ సొంతం చేసుకుంది. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ తో కలిసి చేసిన ఓ 20 నిమిషాల సీన్ ఆమె కెరీర్ ను మలుపు తిప్పింది. దీంతో పాన్ ఇండియా లెవల్లో ఆమె పేరు మారుమోగింది. ప్రస్తుతం ఆమె బీటౌన్ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ త్రిప్తి డిమ్రీ. 2023లో విడుదలైన యానిమల్ సినిమాతో ఈ ఈ బ్యూటీ క్రేజ్ మారిపోయింది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన యానిమల్ చిత్రంలో రణబీర్ కపూర్, రష్మిక మందన్నా జంటగా నటించిన సంగతి తెలిసిందే. పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద ఈ మూవీ రూ.900 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సినిమాలో రణబీర్, త్రిప్తి డిమ్రీ మధ్య వచ్చే సీన్ ఎంత సంచలనం సృష్టించిందో చెప్పక్కర్లేదు. దీంతో ఆమె పేరు మారుమోగింది. ఈరోజు త్రిప్తి పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సినీ తారలు బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని ఒక చిన్న గ్రామానికి చెందిన తృప్తి ఢిల్లీలో చదువుకుంది. చిన్నప్పటి నుంచి ఆమెకు యాక్టింగ్ అంటే చాలా ఇష్టం. తృప్తి యూట్యూబ్ సృష్టికర్త అని, 'విప్రా డైలాగ్స్' ఛానెల్‌లో పలు ప్రకటనలలో నటించింది. యూట్యూబ్‌లో తన అనుభవాల తర్వాత, ఆమె మోడలింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఆమె 'యానిమల్' చిత్రంలో బాబీ డియోల్ సోదరుడిగా నటించిన సౌరభ్ సచ్‌దేవా నుండి నటన పాఠాలు నేర్చుకుంది. ఆమె 2017 లో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. సన్నీ డియోల్, బాబీ డియోల్ చిత్రం 'పోస్టర్ బాయ్స్' చిత్రంతో గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత లైలా మజ్ను, బుల్బుల్, కాలా చిత్రాలతో మరింత ఫేమస్ అయ్యింది. యానిమల్ సినిమా ఆమె కెరీర్ మలుపు తిప్పింది. ఇటీవలే భూల్ భూలయ్యా 3 చిత్రంలో నటించింది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,